

'రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలి'

జియ్యమ్మవలస, జూన్ 19 : ప్రభుత్వ ఆసుపత్రుల్లో రికార్డుల నిర్వహణ పక్కాగా ఉండాలని జిల్లా గణాంకాధికారి శంకరరావు తెలిపారు. బుధవారం ఆయన చినమేరంగి సీహెచ్‌సీని ఏఎస్‌వో కిరణ్‌కుమార్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆన్‌లైన్ రిపోర్టులను పరిశీలించారు. ఆసుపత్రుల్లో అందిస్తున్న అన్ని సేవలను హెచ్‌ఎంఐఎస్ అనే ఫార్మేట్‌లో పొందుపరిచి, పోర్టల్‌లో ఆన్‌లైన్ చేయాలన్నారు. రిపోర్టులో తేడా వస్తే పూర్తిస్థాయిలో శిక్షణ ఇస్తామని వెల్లడించారు. ఈ నెల 25లోగా జిల్లాలో అన్ని ఆసుపత్రులను పరిశీలించి.. కేంద్ర ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామని తెలిపారు.

ఇంటర్ విద్యార్థులకు తీపికబురు

- ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివేవారికి ఉచితంగా పుస్తకాలు, బ్యాగ్‌లు
- ఆదేశాలు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- జిలాల్లో 21 వేల మందికి లబ్ధి
- హర్షం వ్యక్తం చేస్తున్న జిల్లావాసులు



ఇంటర్ విద్యార్థులు

పాలకొండ: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యనభ్యసించే ఇంటర్ విద్యార్థులకు టీడీపీ కూటమి ప్రభుత్వం తీపికబురు అందించింది. అవసరమైన పాఠ్యపుస్తకాలు, నోట్‌పుస్తకాలు, బ్యాగ్‌లు, యూనిఫారాలు, షూస్ ఉచితంగా పంపిణీ చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు ఈ నెల 18న మంత్రి నారా లోకేష్ పాఠశాల విద్యాశాఖకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో చదివే ఇంటర్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



పాలకొండలో ప్రభుత్వ జూనియర్ బాలుర కళాశాల

ఇదీ పరిస్థితి..

వాస్తవంగా 2014 నుంచి 2019 వరకు అధికారంలో ఉన్న టీడీపీ సర్కారు.. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యా ప్రమాణాల మెరుగుకు పటిష్ఠ చర్యలు తీసుకుంది. విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు ఉచితంగా పాఠ్యపుస్తకాలను అందించింది. అయితే 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీన్ మారింది. పాఠ్యపుస్తకాల పంపిణీ, తదితర వాటికి గత వైసీపీ సర్కారు మంగళం పలికింది. దీంతో ప్రభుత్వ కళాశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గింది. కళాశాలలోని విద్యా ప్రమాణాలు సైతం కుంటుపడ్డాయి.

- ఈ పరిస్థితిని తెలుసుకున్న మంత్రి నారా లోకేష్ మొదటి సమీక్షలోనే ఇంటర్ విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్స్, బ్యాగ్‌లు అందించాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఈ ఏడాది విద్యా సంవత్సరంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న 21 వేల మంది విద్యార్థులకు లబ్ధి చేకూరనుంది.
- జిల్లాలో 14 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు ఉన్నాయి. పాలకొండలో ప్రభుత్వ బాలుర, బాలికల జూనియర్‌కళాశాలలు వేర్వేరుగా ఉన్నాయి. పార్వతీపురం, సాలూరు, కురుపాం, గుమ్మలక్ష్మీపురం, చినమేరంగి, పాచిపెంట, బలిజిపేట, కొమరాడ, వీరఘట్టం, మక్కువ, సీతానగరం, భామినిలో ఒక్కో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉంది. ఈ కళాశాలల్లో ఇంటర్ మొదటి సంవత్సరం 9 వేల మంది, ఇంటర్ ద్వితీయ సంవత్సరం 12 వేల మంది ఉన్నారు. వీరందరూ ఈ ఏడాది అందించే ఉచిత విద్యా కిట్లు అందుకోనున్నారు.

ఉత్తర్వులు అందాయి..

ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఇంటర్ చదివే విద్యారులకు ఈ విద్యా సంవత్సరంలో ఉచితంగా పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, బ్యాగ్‌లు, యూనిఫారం, షూలు ఉచితంగా అందజేయాలని ఉన్నతాధికారుల నుంచి ఉత్తర్వులు అందాయి. ఈ మేరకు జిల్లాలోని అన్ని కళాశాలలకు ఆదేశాలు జారీ చేశాం. ప్రభుత్వం అందించే ఉచిత విద్యా కిట్లు వల్ల విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది.

-మంజులవాణి, డీఐఈవో, పార్వతీపురం మన్యం

పనులు సరే.. ప్రయోజనమేదీ?

- ఇష్టానుసారంగా ఉపాధి హామీ చెరువుల పనులు
- రెవెన్యూ, నీటి పారుదలశాఖలకు సంప్రదించని వైనం
- ఏటా సాగునీటికి కటకట
- ఆయకట్టుదారులకు తప్పని ఇబ్బందులు

(జియ్యమ్మవలస)

జిల్లాలో ఉపాధి హామీ పథకం కింద చేపడుతున్న చెరువు పనుల వల్ల రైతులకు ఎటువంటి ప్రయోజనం ఉండడం లేదు. అధికారుల తీరుతో లక్ష్యం నీరుగారుతోంది. ఇష్టారాజ్యంగా చేపడుతున్న పనుల కారణంగా ఆయకట్టుదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. పూర్తిస్థాయిలో వారి పొలాలకు సాగునీరు అందడం లేదు. దీంతో ఏటా వారు వరుణుడిపైనే ఆధారపడి సాగు చేపట్టాల్సి వస్తోంది. వాస్తవంగా చెరువు పనులు చేసేటప్పుడు ఇటు రెవెన్యూశాఖ, అటు నీటి పారుదలశాఖలకు తెలియజేయాల్సి ఉంది. ఆయా శాఖాధికారుల అనుమతి తీసుకోవాల్సి ఉంది. చెరువుల విస్తీర్ణం, తదితర అంశాలు తెలుసుకోవాలనే నిబంధన ఉన్నా.. జిల్లాలో అదెక్కడా అమలు కావడం లేదు. దీంతో కోట్లాది రుపాయలు వెచ్చిస్తున్నా.. ఆశించిన ఫలితం దక్కడం లేదు. దీనిపై ఉపాధి హామీ పథకం అధికారులు కూడా పట్టించుకోవడం లేదనే విమర్శలు బాహాటంగానే వినిపిస్తున్నాయి.



చినమేరంగి చెరువులో ఎక్కడికక్కడ గోతులుగా తవ్వేసిన దృశ్యం

ఇదీ పరిస్థితి

జిల్లాలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి పనులకు గాను 15 మండలాల్లో 15 బ్లాకులు ఉన్నాయి. వాటి పరిధిలో 450 గ్రామ పంచాయతీలుండగా, వేజ్ ద్వారా రూ. 21,671.37 లక్షలు, మెటీరియల్ రూపంలో రూ. 4,856.58 లక్షలతో 39 వేల పనులు జరుగుతున్నాయి. జిల్లాలో వంద ఎకరాలు దాటి విస్తీర్ణం ఉన్న చెరువులు 107 ఉండగా, అవి 21,591.58 ఎకరాల ఆయకట్టుకు నీరందించే సామర్థ్యం కలిగి ఉన్నాయి. వంద ఎకరాల కంటే తక్కువ విస్తీర్ణం ఉన్న పంచాయతీరాజ్ చెరువులు 2,749 ఉండగా, ఇవి 50,476.14 ఎకరాలకు సాగునీరందించనున్నాయి. కానీ చాలా చెరువులు సగానికి పైగా ఆక్రమణల్లో ఉన్నాయి. మరికొన్ని పూర్తిగా కనుమరుగైపోయాయి.

- వాస్తవంగా జిల్లాలో ఉన్న సాగునీటి చెరువులు సామాజిక ఆస్తి. దీనిని పరిరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉంది. అయితే కొంతమంది దర్జాగా కబ్జా చేసుకోవడం వల్ల వందల ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువులు ఇప్పుడు పదుల ఎకరాల విస్తీర్ణానికి పడిపోయాయి. ఇలాంటి పరిస్థితుల్లో కబ్జాకు గురైన చెరువు మళ్లీ పూర్తి విస్తీర్ణంగా వచ్చేలా పనులు చేయాల్సి ఉంది. కానీ ఉన్న ఆ కొద్దిపాటి విస్తీర్ణంలోని పనులు చేసేసి ఉపాధి అధికారులు చేతులు దులుపుకుంటున్నారు. కనీసం రెవెన్యూ, నీటి పారుదలశాఖల అధికారుల అనుమతి తీసుకోవడం లేదు. ఇష్టానుసారంగా చెరువు పనులు చేపడుతుండడం వల్ల ఆయకట్టు రైతులకు ఎటువంటి ప్రయోజనం ఉండడం లేదు.
- చెరువు గర్భంలో ఇష్టారాజ్యంగా పనులు చేసి మరంత లోతు చేయడం వల్ల మదుములు, చప్టాలు ఎత్తులో ఉండిపోయి సాగునీరు సజావుగా అందకుండాపోతోంది.
- చెరువుల్లో నీరు ఉండి కూడా వర్షాలు పడని సమయంలో గతంలో ఆయకట్టు రైతులు సక్రమంగా తమ పొలాలకు సాగునీరు మళ్లించేవారు. ఇప్పుడు ఉపాధి పనుల వల్ల ఇంజన్లు పెట్టి తోడుకోవాల్సిన దుస్థితి నెలకొంది.
- చెరువు పనులు చేసేటప్పుడు ముందుగా రెవెన్యూశాఖకు తెలియజేయాల్సి ఉంది. వారు చెరువు విస్తీర్ణాన్ని కొలిచి హద్దులు ఏర్పాటు చేసిన తర్వాత పనులు చేయాలి. కానీ జిల్లాలో ఎక్కడా అలా జరగడం లేదు.
- ఒక క్రమ పద్ధతిలో చెరువు పనులు చేయడం లేదు. ఇష్టారాజ్యంగా ఎవరికి నచ్చిన చోట వారు పనులు చేస్తూ చేతులు దులుపుకుంటున్నారు. దీనివల్ల చెరువుల గర్భంలో గుమ్మలు, గోతులే దర్శనమిస్తున్నాయి.
- చెరువు పనులు చేసేటప్పుడు మట్టిని గట్లపై వేసి వాటిని సక్రమంగా చదును చేయాలి. కానీ అలా చేయకపోవడం వల్ల వర్షాలు పడిన సందర్భంలో ఆ గట్టుపైన వేసిన మట్టంతా మళ్లీ చెరువుల్లోకి జారిపోతుంది.
- ఉపాధి హామీ ఉన్నతాధికారులు పర్యవేక్షణ కూడా అంతంతమాత్రంగానే ఉంటుంది.

అనుమతి కోరడం లేదు

ఉపాధి హామీ పనులు చేసినప్పుడు నీటి పారుదలశాఖ అనుమతి ఉండాలి. ఆ శాఖ ఇచ్చిన సలహాలు, సూచనలు ద్వారా పనులు చేయాల్సి ఉంది. కానీ అలా జరగడం లేదు.

- జీవీ రఘు, ఏఈ, నీటి పారుదలశాఖ, జియ్యమ్మవలస మండలం

నాడు-నేడు.. ఇక ఎస్ఐఐ

- స్కూల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇంప్రూవ్‌మెంట్‌గా మార్చిన ప్రభుత్వం

సాలూరు రూరల్, జూన్ 19: గత వైసీపీ సర్కారు ప్రవేశపెట్టిన నాడు-నేడు పథకాన్ని టీడీపీ కూటమి ప్రభుత్వం కొనసాగింపునకు చర్యలు తీసుకుంది. విద్యార్థుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని నాడు-నేడు పథకం పేరును మార్చేసింది. ఇక నుంచి స్కూల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇంప్రూవ్‌మెంట్ (ఎస్ఐఐ) పేరుతో అమలు చేయనుంది. ఈ మేరకు బుధవారం విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. పాఠశాలల్లో మౌలిక వసతులకు కల్పనకు ఉద్దేశించిన ఈ పథకాన్ని కొనసాగించి విద్యాభివృద్ధికి పెద్దపీట వేయనున్నారు. జిల్లాలో 1,503 పాఠశాలల్లో తొలి విడత కొన్ని బడుల్లో నాడు నేడు కింద పనులు చేశారు. రెండో విడత కింద 521 పాఠశాలలను ఎంపిక చేసి రూ. 144.45 కోట్లతో 2,915 పనులను చేపట్టారు. గతేడాది జూన్ నాటికి ఈ పనులు పూర్తి కావాల్సి ఉంది. నిధులు సకాలంలో విడుదల కాకపోవడం, సిమెంట్, ఇసుక సరఫరా సరిగా లేకపోవంతో పనులు మందగించాయి. ఇప్పటి వరకు 264 పనులకు పైబడి పూర్తయ్యాయి. మిగిలినవి వివిధ దశల్లో ఉన్నాయి. రూ.55.45 కోట్ల వరకు వ్యయమైంది.

గజరాజుల బీభత్సం



సుంకిలో సంచరిస్తున్న ఏనుగులు

గరుగుబిల్లి, జూన్ 19 : గరుగుబిల్లి మండలంలోని పలు గ్రామాల్లో ఏనుగులు బీభత్సం సృష్టిస్తున్నాయి. కొద్ది రోజుల కిందట గిజబ, నందివానివలస, తోటపల్లి, సుంకి, ఖడ్గవలస, సంతోషపురం, మరుపెంట, తదితర గ్రామాల్లో సంచరించి పలు రకాల పంటలను నాశనం చేశాయి. మంగళవారం రాత్రి గిజబలోని ఉపాధి హామీ సమాచార బోర్డులు, పంచాయతీ పరిధిలో పలు కట్టడాలు, బోరు పైపులను ధ్వంసం చేశాయి. ప్రస్తుతం ఏనుగులు సుంకి ప్రాంతానికి తరలి వెళ్లాయి. ప్రస్తుతం వరి నారు పోసేందుకు సిద్ధమవుతున్న తరుణంలో ఏనుగుల గుంపు ప్రత్యక్షం కావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అటవీ శాఖ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి ఈ ప్రాంతం నుంచి ఏనుగుల గుంపును తరలించే చర్యలు చేపట్టాలని వారు కోరుతున్నారు.

పదవీ విరమణ వయోపరిమితి పెంచండి

- కోర్టు మెట్లెక్కిన గురుకుల ఉద్యోగులు
- గత వైసీపీ ప్రభుత్వాన్ని కోరినా.. ఫలితం శూన్యం
- టీడీపీ సర్కారుపైనే ఆశలు

(సీతంపేట)

పదవీ విరమణ వయోపరిమితి పెంచాలని ఐటీడీఏల పరిధిలో గురుకుల ఉద్యోగులు కోరుతున్నారు. ఈ మేరకు వారు కోర్టును ఆశ్రయించారు. వాస్తవంగా గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఉద్యోగుల రిటైర్‌మెంట్ వయసును 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచుతూ చర్యలు తీసుకున్నారు. అయితే గత వైసీపీ సర్కారు గురు కుల కళాశాల పాఠశాలలో పనిచేస్తున్న ఉద్యోగులకు ఆ అవకాశం కల్పించలేదు. పదవీ విరమణ వయోపరిమితిని పెంచలేదు. తమకు రిటైర్‌మెంట్ వయోపరిమితి 62 సంవత్సరాలకు పెంచాలని వారు గత వైసీపీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయింది. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం పాలన పగ్గాలు చేపట్టడంతో ఆయా ఉద్యోగుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. తమకు న్యాయం జరుగుతుందనే ఉద్దేశంతో ఈ నెలాఖరుకు పదవీ విరమణ చేయనున్న వారంతా హైకోర్టును ఆశ్రయించారు. అన్ని సొసైటీల ఉద్యోగులకు పదవీ విరమణ వయోపరిమితి 62 సంవత్సరాలకు పెంచినప్పటికీ తమకు పెంచలేదని, ఈ అంశాన్ని పరిగణనలోకి తీసుకుని.. న్యాయం చేయాలని పార్వతీపురం, సీతంపేట ఐటీడీఏల పరిధిలో గురుకుల ఉద్యోగులు విజ్ఞప్తి చేస్తున్నారు.

మూడేళ్లలో.. 20 శాతమే!

- తొమ్మిది నెలలుగా నిలిచిపోయిన పెద్దగెడ్డ ఆధునికీకరణ పనులు
- జైకా నిధులున్నా.. నిర్మాణాలపై దృష్టి సారించని గత వైసీపీ సర్కారు
- సకాలంలో బిల్లులు చెల్లించని వైనం
- ఆందోళనలో మూడు మండలాల రైతులు
- ఏటా తప్పని సాగునీటి ఇబ్బందులు
- నూతన ప్రభుత్వంపైనే ఆశలు

(పాచిపెంట)

పెద్దగెడ్డ జలాశయం ఆధునికీకరణ పనులకు మోక్షం లభించడం లేదు. ఏళ్లు గడుస్తున్నా తుది దశకు చేరుకోవడం లేదు. గత వైసీపీ సర్కారు సకాలంలో బిల్లులు చెల్లించకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. అయితే ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ప్రారంభమవడంతో మూడు మండలాల్లో 33 గ్రామాల రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాదీ సాగునీటికి ఇబ్బందులు తప్పేలా లేవని ఆవేదన చెందుతున్నారు. నూతన ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని వారు కోరుతున్నారు.



17 కిలో మీటర్ల మేరే జరిగిన కాలువ ఎర్త్ పనులు

ఇదీ పరిస్థితి..

పాచిపెంటలో ఉన్న పెద్దగెడ్డ ప్రాజెక్టు ద్వారా 12 వేల ఎకరాలకు సాగునీరందించాల్సి ఉంది. జిల్లాలోని పాచిపెంట, సాలూరుతో పాటు విజయనగరం జిల్లా రామభద్రపురం మండలాల్లో మొత్తంగా 33 గ్రామాల్లో 7,500 ఎకరాలకు పెద్దగెడ్డ జలాశయమే ఆధారం. ప్రాజెక్టుకు అనుసంధానమైన కర్రివలస, వేగావతి ఆనకట్ట కుడి, ఎడమ కాలువల ద్వారా 4,500 ఎకరాలకు సాగునీరందించాలి. అయితే ఆధునికీకరణ పనులు అనగానే రైతులు ఆశలు ఎంతో పడ్డారు. మూడేళ్లు పైబడినా 20 శాతం పనులే కాగా.. గత తొమ్మిది నెలలుగా నిర్మాణాలను సైతం నిలిపివేశారు. దీంతో అన్నదాతలు మండిపడుతున్నారు.



రెండున్నర కిలో మీటర్లకే పరిమితమైన కాలువ లైనింగ్ పనులు

- వాస్తవంగా 2020-21లో జైకా నిధులు రూ. 23 కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో కాలువలు, ఎర్త్ లైనింగ్, స్పిల్‌వే వద్ద ప్రొటెక్షన్ పనులు, ప్రాజెక్టుకు అనుసంధానమైన కర్రివలస, వేగావతి ఆనకట్ట కుడి, ఎడమ కాలువలు ఆధునికీకరణ పనులు చేపట్టాల్సి ఉంది.
- 27 కిలో మీటర్ల మేర కాలువల ఆధునికీకరణ చేయాల్సి ఉండగా ఎర్త్ పనులు 17 కిలో మీటర్లు మేర మాత్రమే చేశారు. రెండున్నర కిలో మీటర్ల వరకే లైనింగ్ పనులు జరిగాయి. పూర్తిస్థాయిలో లైనింగ్ పనులు జరగకపోవడంతో కాలువలు ద్వారా శివారు భూములకు సాగునీరందడం లేదు.
- గత వైసీపీ ప్రభుత్వం సకాలంలో బిల్లులు చెల్లించకపోవడం వల్ల కాంట్రాక్టర్లు పనులు నిలిపివేసినట్టు తెలుస్తోంది. ఎర్త్‌వర్క్ చేసినప్పటికీ మళ్లీ యథావిధిగా ఆ ప్రాంతంలో తుప్పలు పెరిగిపోయాయి. ఇదిలా ఉండగా గత ఐదేళ్లుగా ఏటా రైతులే కాలువల్లో పూడికలు తీయించాల్సి వస్తోంది. ప్రస్తుతం టీడీపీ ప్రభుత్వం పాలనా పగ్గాలు చేపట్టడంతో రైతుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు సాగునీటి ప్రాజెక్టులపై దృష్టి సారించనున్న నేపథ్యంలో పెద్దగెడ్డ పనులు కూడా త్వరితగతిన పూర్తవుతాయని వారు భావిస్తున్నారు.

సాగునీరందక ఇబ్బందులు

గత వైసీపీ ప్రభుత్వం తీరుతో పెద్దగెడ్డ ప్రాజెక్టు ఆధునికీకరణ పనులు పూర్తవలేదు. మూడేళ్లలో 20 శాతం నిర్మాణాలే అయ్యాయి. శివారు భూములకు సాగునీరందకపోవడంతో ఏటా ఎన్నో ఇబ్బందులు పడ్డాం. టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పనులు జోరుగా సాగుతాయని ఆశిస్తున్నాం.

- పల్లేడ సత్యనారాయణ, రైతు, పాచిపెంట

నోటీసులిచ్చాం

పెద్దగెడ్డ ప్రాజెక్టు ఆధునికీకరణ పనులు నిలిపివేసిన కాంట్రాక్టరుకు నోటీసులిచ్చాం. మళ్లీ పనులు ప్రారంభించాలని ఆదేశించాం. త్వరలో నిర్మాణాలు ప్రారంభిస్తాం.

- బి.కనకారావు, డీఈఈ, పెద్దగెడ్డ ప్రాజెక్టు

దిక్సూచి DIKSUCHI

'కథక్ కేంద్ర'లో నృత్యం, సంగీతం



న్యూఢిల్లీలోని కథక్ కేంద్ర(నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కథక్ డ్యాన్స్)- సంగీతం, కథక్ నృత్యం కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. హిందీ మాధ్యమంలో బోధన ఉంటుంది. అభ్యర్థులకు హిందీ, ఇంగ్లీష్ భాషలు చదవడం, రాయడం తెలిసి ఉండాలి. అడ్మిషన్ టెస్ట్‌లో సాధించిన మెరిట్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. ఎంపికైన అభ్యర్థులకు స్టయిపెండ్ సౌకర్యం ఉంది.

కథక్ డ్యాన్స్: ఇందులో రెండు ఎలిమెంటరీ కోర్సులు, నాలుగు అడ్వాన్స్‌డ్ కోర్సులు ఉన్నాయి.
- **ఎలిమెంటరీ కోర్సులు:** అయిదేళ్ల ఫౌండేషన్ కోర్సు, మూడేళ్ల డిప్లొమా కోర్సు
- **అడ్వాన్స్‌డ్ కోర్సులు:** ఏడాది వ్యవధిగల ప్రిపరేటరీ ఫేజ్ కోర్సు, మూడేళ్ల డిప్లొమా ఆనర్స్ కోర్సు, రెండేళ్ల పోస్ట్ డిప్లొమా కోర్సు, ఆర్నెల్ల రిఫ్రెషర్ కోర్సు.

సంగీతం: ఇందులో ఏడాది వ్యవధిగల సర్టిఫికెట్ కోర్సు(తబలా/పఖవాజ్/సారంగి/ఓకల్), మూడేళ్ల డిప్లొమా స్పెషల్ కోర్సు(తబలా/పఖవాజ్/సారంగి/ఓకల్) ఉన్నాయి.

నృత్యం కోర్సులకు అర్హత: ఫౌండేషన్ కోర్సులో ప్రవేశానికి కనీసం మూడోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. అభ్యర్థులకు జూన్ 1 నాటికి 10 నుంచి 15 ఏళ్ల మధ్య వయసు ఉండాలి. కథక్ నృత్యంలో పరిచయం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది.
- డిప్లొమా కోర్సులో ప్రవేశానికి కనీస తొమ్మిదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి. అభ్యర్థులకు జూన్ 1 నాటికి 15 నుంచి 20 ఏళ్ల మధ్య వయసు ఉండాలి. సంగీతం, థియేటర్ ఆర్ట్స్, విజువల్ ఆర్ట్స్‌లో ఆసక్తి/అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది.
- డిప్లొమా ఆనర్స్ కోర్సులో ప్రవేశానికి ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణతతోపాటు డిప్లొమా (కథక్) పూర్తి ఉండాలి. అభ్యర్థులకు జూన్ 1 నాటికి 19 నుంచి 23 ఏళ్ల మధ్య వయసు ఉండాలి. హిందుస్థానీ ఓకల్ మ్యూజిక్, తబల/పఖవాజ్ శిక్షణ పొందినవారికి; లిటరేచర్, థియేటర్ ఆర్ట్స్, విజువల్ ఆర్ట్స్‌లో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది.
- పోస్ట్ డిప్లొమా కోర్సులో ప్రవేశానికి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు డిప్లొమా ఆనర్స్(కథక్) పూర్తిచేసి ఉండాలి. అభ్యర్థుల వయసు జూన్ 1 నాటికి 21 నుంచి 26 ఏళ్ల మధ్య ఉండాలి. లిటరేచర్, విజువల్ ఆర్ట్స్‌లో ఆసక్తి ఉన్నవారికి ప్రాధాన్యం ఉంటుంది.
- రిఫ్రెషర్ కోర్సులో ప్రవేశానికి పోస్ట్ డిప్లొమా కోర్సు పూర్తిచేసి ఉండాలి. డ్యాన్స్ టీచర్‌గా పనిచేస్తూ ఉండాలి. అభ్యర్థుల వయసు జూన్ 1 నాటికి 40 ఏళ్లలోపు ఉండాలి.

సంగీతం కోర్సులకు అర్హత: సర్టిఫికెట్ కోర్సులో ప్రవేశానికి అభ్యర్థులకు జూన్ 1 నాటికి 19 నుంచి 21 ఏళ్ల మధ్య వయసు ఉండాలి. ఇంటర్/పన్నెండోతరగతి ఉత్తీర్ణతతోపాటు ఓకల్ మ్యూజిక్‌లో అవగాహన తప్పనిసరి.
- డిప్లొమా స్పెషల్ కోర్సులో ప్రవేశానికి అభ్యర్థులకు 20 నుంచి 25 ఏళ్ల మధ్య వయసు ఉండాలి. ఏదేని డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు ఓకల్ మ్యూజిక్‌లో పరిజ్ఞానం ఉండాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.200
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 26
- **అడ్మిషన్ టెస్ట్ తేదీలు:** నృత్యంలో ఎలిమెంటరీ కోర్సులకు జూలై 2, 3, 4; నృత్యంలో అడ్వాన్స్‌డ్ కోర్సులు, సంగీతం కోర్సులకు జూలై 8, 9, 10
- **ఈ-మెయిల్:** admission@kathakkendra.in
- **వెబ్‌సైట్:** www.kathakkendra.in

ఐఐటీ ఇండోర్‌లో ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ

ఇండోర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ) ఆధ్వర్యంలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ బయోసైన్సెస్ అండ్ బయో మెడికల్ ఇంజనీరింగ్- 'ఎమ్మెస్సీ బయోటెక్నాలజీ' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. నాలుగు సెమిస్టర్లు ఉంటాయి. గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ బయోటెక్నాలజీ(జీఏటీ) 2024 స్కోర్ ద్వారా ప్రవేశాలు కల్పిస్తారు. అడ్మిషన్ పొందినవారికి నెలకు రూ.5,000ల ఫెలోషిప్ ఇస్తారు. రీసెర్చ్‌పై ఆసక్తి గల అభ్యర్థులు మూడో సెమిస్టర్‌లో ఎమ్మెస్సీ+పీహెచ్‌డీ డ్యూయెల్ డిగ్రీ ప్రోగ్రామ్‌లోకి మారవచ్చు.



అర్హత వివరాలు: గుర్తింపు పొందిన కళాశాల నుంచి మూడు/నాలుగు/అయిదేళ్ల డిగ్రీ(బయాలజీ/బయోటెక్నాలజీ/అగ్రికల్చర్-బయాలజీ ఒక సబ్జెక్టుగా) ఉత్తీర్ణులై ఉండాలి. ప్రథమశ్రేణి మార్కులు తప్పనిసరి. గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ బయోటెక్నాలజీ(జీఏటీ) 2024 అర్హత పొంది ఉండాలి. పీహెచ్‌డీలోకి మారాలనుకునేవారు సీఎస్ఐఆర్/యూజీసీ/డీబీటీ జేఆర్ఎఫ్ అర్హత పొంది ఉండాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 21
- **దరఖాస్తుతోపాటు అప్‌లోడ్ చేయాల్సిన పత్రాలు:** పదోతరగతి, ఇంటర్ మార్కుల పత్రాలు, సర్టిఫికెట్‌లు; జీఏటీ-బీ 2024 ర్యాంక్ కార్డ్; కులం, వైకల్యం ధ్రువీకరణ పత్రాలు; అభ్యర్థి ఫొటో, సంతకం
- **వెబ్‌సైట్:** www.iiti.ac.in

ఉస్మానియా వర్సిటీలో ఇంటర్న్‌షిప్

హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన 'ప్రొఫెసర్ టీనవనీత రావు సెంట్రల్ ఫెసిలిటీస్ ఫర్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్' విభాగం- నాలుగో ఇంటర్న్‌షిప్ ప్రోగ్రామ్‌ను నిర్వహిస్తోంది. ప్రోగ్రామ్ వ్యవధి వారం. ఇందులో రీసెర్చ్ టెక్నిక్స్, టెక్నికల్ స్కిల్స్‌కు సంబంధించి శిక్షణ ఇస్తారు. జూన్ 24 నుంచి 29 వరకు ప్రతిరోజూ ఉదయం పది గంటల నుంచి సాయంత్రం అయిదు గంటల వరకు శిక్షణ తరగతులు, వర్క్‌షాప్‌లు ఉంటాయి. లైఫ్ సైన్సెస్, ఫార్మసీ, కెమిస్ట్రీ విభాగాలకు చెందిన ఫ్యాకల్టీ మెంబర్లు, పీహెచ్‌డీ స్కాలర్స్, పీజీ స్టూడెంట్స్ దరఖాస్తు చేసుకోవచ్చు. మొత్తం 40 మందికి అవకాశం కల్పిస్తారు. ఎంపికైన అభ్యర్థులు నిర్దేశిత రుసుం చెల్లించి వర్సిటీ గెస్ట్ హౌస్‌లో వసతి సౌకర్యం పొందవచ్చు. అభ్యర్థులందరూ ల్యాబ్ కోట్, మాస్క్ వెంట తెచ్చుకోవాలి. ప్రోగ్రామ్ చివరలో అభ్యర్థులకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు ఇస్తారు.
- **రిజిస్ట్రేషన్ ఫీజు:** రూ.3,500
- **ఈ-మెయిల్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 23
- **ఈ-మెయిల్:** cfrdou@gmail.com
- **వెబ్‌సైట్:** www.osmania.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/475qNInలో చదవండి.

కొండా లక్ష్మణ్ వర్సిటీలో హార్టికల్చర్ డిప్లొమా

ములుగు(సిద్దిపేట్)లోని శ్రీ కొండా లక్ష్మణ్ తెలంగాణ స్టేట్ హార్టికల్చరల్ యూనివర్సిటీ(ఎస్‌కేఎల్‌టీఎస్‌హెచ్‌యూ)- 'డిప్లొమా ఇన్ హార్టికల్చర్' ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రభుత్వ, ప్రైవేట్ అనుబంధ పాలిటెక్నిక్ కళాశాలల్లో అడ్మిషన్స్ ఇస్తారు. ఒక్కో కళాశాలలో 40 చొప్పున మొత్తం 200 సీట్లు ఉన్నాయి. వీటిలో 60 శాతం సీట్లను గ్రామీణ విద్యార్థులకు, 40 శాతం సీట్లను పట్టణ ప్రాంతాల విద్యార్థులకు కేటాయించారు. తెలంగాణ పాలిసెట్ 2024 ర్యాంక్/పదోతరగతి మార్కుల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. స్థానికులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలి.

ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలు
- ఆదిలాబాద్ హార్టికల్చర్ పాలిటెక్నిక్
- రామగిరిఖిల్లా హార్టికల్చర్ పాలిటెక్నిక్
- కొల్లాపూర్ హార్టికల్చర్ పాలిటెక్నిక్

అనుబంధ పాలిటెక్నిక్ కళాశాలలు
- గంట గోపాల్ రెడ్డి హార్టికల్చర్ పాలిటెక్నిక్-గడ్డిపల్లి, సూర్యాపేట్ జిల్లా
- విశ్వధరణి హార్టికల్చర్ పాలిటెక్నిక్-తొర్రూరు, మహబూబాబాద్ జిల్లా



అర్హత: అభ్యర్థులు కనీసం 35 శాతం మార్కులతో పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. తెలంగాణ పాలిసెట్ 2024లో అర్హత పొంది ఉండాలి. సీబీఎస్ఈ/ఐసీఎస్ఈ/ఎన్ఐఓఎస్/టీఓఎస్ఎస్ నుంచి సైన్స్ ఒక సబ్జెక్ట్‌గా పదోతరగతి పూర్తిచేసినవారు, ఇంటర్ ఫెయిల్ అయిన అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్/హయ్యర్ డిగ్రీ కోర్సులు పూర్తిచేసినవారు దరఖాస్తుకు అనర్హులు. 2024 డిసెంబరు 31 నాటికి అభ్యర్థుల వయసు 15 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.
- **ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1100; దివ్యాంగులు, ఎస్సీ ఎస్టీ అభ్యర్థులకు రూ.600
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 15
- **వెబ్‌సైట్:** www.skltshu.ac.in

దామోదరం సంజీవయ్య వర్సిటీలో ఎల్ఎల్‌బీ

విశాఖపట్నంలోని దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ(డీఎస్ఎన్ఎల్‌యూ)- ఎల్ఎల్‌బీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. దేశవ్యాప్తంగా వర్సిటీ నిర్వహించే ఎంట్రెన్స్ టెస్ట్(డీఈటీ) ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

సీట్ల వివరాలు: మొత్తం 138 సీట్లు ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్ స్టేట్ కేటగిరీ కింద 66 సీట్లు, ఆలిండియా కేటగిరీ కింద 54 సీట్లు, మిగిలినవి వేరే కేటగిరీలకు కేటాయించారు.

అర్హత: గుర్తింపు పొందిన కళాశాల నుంచి మూడేళ్ల వ్యవధి గల ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.
- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.2,500; బీసీ, ఓబీసీ అభ్యర్థులకు రూ.2,200; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1800
- **ఈ-మెయిల్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 12
- **ఈ-మెయిల్:** admissions@dsnlu.ac.in
- **వెబ్‌సైట్:** https://dsnlu.ac.in



నా కెరీర్‌లో కల్కి లాంటి సినిమా చేయలేదు

అమితాబ్ బచ్చన్

'కల్కి 2898 ఏడీ' చిత్రంలో భాగమవడం గొప్ప గౌరవంగా భావిస్తున్నాను. ఇదో కొత్త ప్రపంచం, నా కెరీర్‌లో ఇప్పటిదాకా ఇలాంటి సినిమా చేయలేదు. 'కల్కి' చిత్రీకరణలో అనుభవాలను ఎప్పటికీ మర్చిపోలేను' అని అమితాబ్ బచ్చన్ అన్నారు.

ప్రభాస్ కథానాయకుడిగా నాగ్ అశ్విన్ తెరకెక్కించిన చిత్రమిది. అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్ సహా పలువురు అగ్రనటులు కీలకపాత్రలు పోషించారు. దీపికా పదుకొనే, దిశాపటానీ కథానాయికలు. వైజయంతీ మూవీస్ బేనర్‌పై సి. అశ్వనీదత్ నిర్మించారు. ఈ నెల 27న ఈ చిత్రం విడుదలవుతోంది. బుధవారం ముంబైలో ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా అమితాబ్ బచ్చన్ మాట్లాడుతూ 'ఓ వినూత్నమైన చిత్రానికి రూపకల్పన చేసిన నాగ్ అశ్విన్, అతని బృందానికి నా అభినందనలు. ఆయన ఈ కథ చెప్పినప్పుడు ఆశ్చర్యపోయాను. అయన ఇలాంటి కథని ఎలా ఆలోచించగలిగాడో అనిపించింది. ఈ చిత్రంలో విజువల్స్ అసాధారణంగా ఉంటాయి. తన ఆలోచనలను తెరపైన అద్భుతంగా ఆవిష్కరించగలిగాడు. ఈ ఫ్యూచరిస్టిక్ ప్రాజెక్ట్ ఓ మహా అద్భుతం' అని నాగ్ అశ్విన్‌ను ప్రశంసించారు.




తన పాదాలకు నమస్కరించబోతున్న అమితాబ్‌ను వారిస్తున్న అశ్వనీదత్

కమల్‌హాసన్ మాట్లాడుతూ 'నాగ్ అశ్విన్ కూడా మా గురువుగారు బాలచందర్‌లా సాదాసీదాగా కనిపిస్తాడు కానీ అసాధారణ ప్రజ్ఞావంతుడు. తన ఆలోచనలను సృజనాత్మకంగా తెరకెక్కించగల నేర్పు నాగ్ అశ్విన్‌లో అపారంగా ఉంది. ఇందులో ప్రతినాయక ఛాయలున్న పాత్ర నాది. మంచి వినోదం పంచుతుంది. నా ఫస్ట్‌లుక్‌లానే సినిమా కూడా మిమ్మల్ని ఆశ్చర్యపరుస్తుంది' అన్నారు.

ప్రభాస్ మాట్లాడుతూ 'దిగ్గజాలతో పనిచేసే అవకాశం కల్పించిన అశ్వనీదత్, నాగీకి ధన్యవాదాలు. దేశవ్యాప్తంగా పాపులారిటీ సాధించిన తొలి భారతీయ నటుడు అమితాబ్‌బచ్చన్. ఆయన నుంచి చాలా నేర్చుకున్నాను. నా చిన్నప్పుడు కమల్‌హాసన్ గారి సినిమాలు చూసి ఆయనలా నటించేవాణ్ణి. దీపిక అంతర్జాతీయ స్థాయిలో రాణించారు. ఇంతమంది గొప్ప నటులతో కలసి నటించానంటే నమ్మలేకపోతున్నాను' అని చెప్పారు. దీపికా పదుకొనే మాట్లాడుతూ 'నాగీ క్రియేట్ చేసిన మ్యాజిక్ 'కల్కి' చిత్రం. ఆయనో జీనియస్. తనలో చాలా స్పష్టత ఉంది. సినిమాను అద్భుతంగా తీశారు. నటిగా నాకు గొప్ప అనుభవం మిగిల్చిన సినిమా ఇది' అన్నారు. అశ్వనీదత్ మాట్లాడుతూ 'అమితాబ్ బచ్చన్, కమల్‌హాసన్, ప్రభాస్, దీపిక సమక్షంలో ఈ కార్యక్రమం నిర్వహించినందుకు ఆనందంగా ఉంది. 'కల్కి' గొప్ప విజయాన్ని అందుకోవాలని ఆకాంక్షిస్తున్నాను' అన్నారు.

కూల్ అవ్వండి మేడం గారు



విభిన్న భాషల్లో సినిమాలు చేస్తూ నటుడిగా జాతీయ స్థాయిలో చక్కని గుర్తింపు సొంతం చేసుకున్నారు దుల్కర్ సల్మాన్. తెలుగులోనూ 'మహానటి', 'సీతారామం' లాంటి చిత్రాలతో విజయాలను అందుకున్నారు. ఆయన తాజాగా నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'లక్కీ భాస్కర్'. వెంకీ అట్లూరి దర్శకత్వం వహిస్తున్నారు. ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్టైన్‌మెంట్స్ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. 'లక్కీ భాస్కర్' చిత్రంలో బ్యాంక్ క్యాషియర్‌గా మునుపెన్నడూ చూడని కొత్త లుక్‌లో దుల్కర్ సల్మాన్ కనిపించనున్నారు. ఈ చిత్రం నుంచి 'కోపాలు చాలండి శ్రీమతి గారు...కొంచెం కూల్ అవ్వండి మేడం గారు' అంటూ సాగే గీతాన్ని యూనిట్ బుధవారం విడుదల చేసింది. జీవీ ప్రకాశ్ కుమార్ ప్రత్యేక శైలిలో స్వరపరిచిన ఈ గీతాన్ని విశాల్ మిశ్రా, శ్వేతా మోహన్‌లు ఆలపించారు. శ్రీమణి సాహిత్యం ఈ గీతానికి ప్రత్యేకాకర్షణగా నిలిచింది. దుల్కర్ సరసన మీనాక్షి చౌదరి కథానాయికగా నటిస్తున్నారు. సూర్యదేవర నాగవంశీ, సాయిసౌజన్య నిర్మిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: నిమిష్ రవి, ఎడిటర్:నవీన్ నూలి

ఎస్‌కే 30 షురూ



ఇప్పటిదాకా లవ్‌స్టోరీలు, మాస్ యాక్షన్ ఎంటర్టైనర్లతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన సందీప్ కిషన్ తన పంథా మార్చారు. తన కెరీర్‌లో చేయని సరికొత్త కథాంశంతో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. ఆయన హీరోగా రూపొందుతున్న 30వ చిత్రం (ఎస్‌కే 30)లో ఓ సరికొత్త పాత్రలో అలరించబోతున్నారు. ప్రేమ, భావోద్వేగాలు, కుటుంబ అనుబంధాలు చుట్టూ అల్లుకున్న కథ ఇది. బుధవారం ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ హైదరాబాద్‌లో ప్రారంభమైంది. పలు బ్లాక్‌బస్టర్ ఎంటర్టైనర్‌లను అందించిన త్రినాథరావు నక్కిన 'ఎస్‌కే 30'కు దర్శకత్వం వహిస్తున్నారు. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్, హాస్య మూవీస్, జీ స్టూడియోస్ కలయికలో రాజేశ్ దండా భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. రావు రమేశ్ కీలకపాత్ర పోషిస్తున్నారు. ప్రసన్నకుమార్ బెజవాడ కథ, మాటలు అందిస్తున్నారు. లియోన్ జేమ్స్ సంగీత సారథ్యం వహిస్తున్నారు. డీవోపీ: నిజార్ షఫీ. ఎడిటర్: చోటా కే ప్రసాద్. బాలాజీ గుత్తా సహనిర్మాతగా వ్యవహరిస్తున్నారు.

ఆధ్యాత్మిక అంశాలతో...



అశ్విన్‌బాబు, అర్బాజ్‌ఖాన్, దిగంగనా సూర్యవంశీ ప్రధాన తారాగణంగా రూపొందుతున్న చిత్రం 'శివం భజే'. బ్రహ్మాజీ, దేవి ప్రసాద్, కాశీ విశ్వనాథ్ కీలకపాత్రలు పోషిస్తున్నారు. అప్సర్ దర్శకత్వంలో మహేశ్వర్‌రెడ్డి మూలి నిర్మిస్తున్నారు. బుధవారం 'శివంభజే' టీజర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఆధ్యాత్మిక అంశాలకు యాక్షన్ హంగులను మేళవించి రూపొందించిన చిత్రమిదని టీజర్‌ను బట్టి తెలుస్తోంది. జూలైలో 'శివం భజే'ను విడుదల చేస్తామని నిర్మాత తెలిపారు. టైటిల్‌తోనే మా సినిమా ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించిందని దర్శకుడు చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం:వికాస్ బడిస, సినిమాటోగ్రఫీ: దాశరథి శివేంద్ర

'నింద' అందరికీ నచ్చుతుంది



'కాంద్రకోట మిస్టరీ' అని మా సినిమా పోస్టర్ వదిలినప్పుడు అందరూ ఇది ఘోస్ట్ సినిమా అనుకున్నారు. టీజర్ తర్వాత అందరికీ ఓ క్లారిటీ వచ్చింది. వరుణ్ సందేశ్‌కు ఇది తగిన క్యారెక్టర్. ఆయనకు ఇది కమ్ బ్యాక్ సినిమా అవుతుంది' అన్నారు రాజేశ్ జగన్నాథం. వరుణ్‌సందేశ్ హీరోగా ఆయన స్వీయ దర్శకత్వంలో నిర్మించిన 'నింద' చిత్రం ఈ నెల 21న విడుదలవుతోంది. ఈ నేపథ్యంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ 'ఈ కథ మీద నాకు నమ్మకం ఉంది. నిర్మాతల కోసం ప్రయత్నించా. ఆ తర్వాత వేరే వాళ్లు ఎందుకని నేనే నిర్మాతగా మారా. నాకు క్రియేటివ్ ఫీల్డ్ అంటే ఇష్టం. దర్శకత్వ శాఖ నాకు నచ్చింది. సినిమా తీయడం ఇష్టం కూడా. అయితే తీసిన సినిమాను విడుదల చేయడం ఎంత కష్టమో ఇప్పుడు అర్థమవుతోంది' అని ఆయన చెప్పారు.

ఆర్కిటెక్ట్ నిత్య



'మనమే' చిత్రంతో మంచి హిట్‌ను తన ఖాతాలో వేసుకున్నారు శర్వానంద్. ఇప్పుడు తన తదుపరి చిత్రం ('శర్వా 37-వర్కింగ్ టైటిల్) షూటింగ్‌లో పాల్గొంటున్నారు. ఈ చిత్రానికి 'సామజ వరగమన' సినిమాతో మంచి విజయాన్ని సొంతం చేసుకున్న రామ్ అబ్బరాజు దర్శకత్వం వహిస్తున్నారు. అనిల్ సుంకర, రామబ్రహ్మం సుంకర నిర్మిస్తున్నారు. 'ఏజెంట్' చిత్రంలో తన గ్లామర్‌తో అలరించిన సాక్షి వైద్య శర్వాకు జోడీగా నటిస్తున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. బుధవారం సాక్షి పుట్టిన రోజు సందర్భంగా చిత్రబృందం ఆమె పాత్రను పరిచయం చేసింది. ఆర్కిటెక్ట్ నిత్య పాత్రలో సాక్షి కనిపించనున్నారు. ఫ్యామిలీ ఎంటర్టైనర్‌గా తెరకెక్కుతోన్న ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం హైదరాబాద్‌లో జరుగుతోంది. విశాల్ చంద్రశేఖర్ సంగీతం అందిస్తుండగా, జ్ఞానశేఖర్ వీఎస్ సినిమాటోగ్రాఫర్‌గా పనిచేస్తున్నారు. అజయ్ సుంకర సహ నిర్మాత.

నా కెరీర్‌లో బెస్ట్ థ్రిల్లర్



నవీన్‌చంద్ర హీరోగా తెలుగు, తమిళ భాషల్లో రూపొందిన ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ 'లెవెన్'. లోకేశ్ అజ్ల్స్ దర్శకత్వంలో అజ్మల్ ఖాన్, రేయా హరి నిర్మిస్తున్నారు. ఈ సినిమా టీజర్‌ను హీరో నిఖిల్ ట్విట్టర్ ద్వారా విడుదల చేశారు. ఈ సందర్భంగా బుధవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో హీరో నవీన్‌చంద్ర మాట్లాడుతూ 'ఈ కథ వినగానే నచ్చేసింది. స్క్రిప్ట్ కోసం ఇంత ప్యాషన్‌గా పని చేసిన నిర్మాతలను నేను చూడలేదు. తప్పకుండా మంచి విజయం సాధిస్తారు. నా కెరీర్‌లో బెస్ట్ థ్రిల్లర్ అవుతుంది' అని చెప్పారు. నిర్మాతల్లో ఒకరైన రేయా హరి మాట్లాడుతూ 'తెలుగులో నాకు ఇది మొదటి సినిమా. ఇందులో భాగం కావడం ఆనందంగా ఉంది' అన్నారు. 'మాకు ఇది మూడో సినిమా. మొదటి రెండు చిత్రాలూ హిట్ అయ్యాయి. తెలుగు, తమిళ భాషల్లో విడివిడిగా తీశాం. ఇది ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్. అందరికీ నచ్చుతుంది' అని మరో నిర్మాత అక్బర్ చెప్పారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ జరుగుతోందనీ, త్వరలోనే థియేటర్లలో చిత్రాన్ని విడుదల చేస్తామనీ నిర్మాతలు చెప్పారు.

ఆకట్టుకునే సినిమా కథ



అభిరామ్, వెన్నెల, మనోహర్, పవన్, కృష్ణ, మంజుల హీరోహీరోయిన్లుగా నటించిన చిత్రం 'ఇట్లు.. మీ సినిమా' ఈ నెల 21న విడుదల కానుంది. నలుగురు యువకులు సినిమా మీదున్న ఫ్యాషన్‌తో చిత్ర పరిశ్రమలోకి అడుగుపెట్టి ఎటువంటి సవాళ్లు ఎదుర్కొన్నారు.. అనే కథాంశంతో రూపుదిద్దుకున్న చిత్రమిది. లవ్, రొమాన్స్, కామెడీ, సెంటిమెంట్ అంశాలతో రూపుదిద్దుకున్న ఈ చిత్రానికి హరీశ్ చావా దర్శకుడు. నోరి నాగప్రసాద్ నిర్మాత. ఈ సినిమా ట్రైలర్‌ను విడుదల చేసిన సందర్భంగా ప్రసాద్ ప్రీవ్యూ థియేటర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో దర్శకుడు హరీశ్ చావా మాట్లాడుతూ 'సినిమా కథ కోసం అన్వేషిస్తున్నప్పుడు ఏ కథో ఎందుకు.. సినిమా ఇండస్ట్రీలో పడే ఇబ్బందుల గురించి సినిమా తీద్దాం అన్నారు మా నిర్మాత. పరిశ్రమలోకి అడుగుపెట్టే వారికి అవగాహన కల్పించే విధంగా మా సినిమా ఉంటుంది. ప్రేక్షకులందరికీ తప్పకుండా నచ్చుతుంది' అని చెప్పారు. 'పరిశ్రమలోకి వచ్చే కొత్త వాళ్లు పడే ఇబ్బందుల్ని ఆసక్తికరంగా, ప్రేక్షకులకు నచ్చే రీతిలో చూపించాం. ఈ నెల 21న విడుదల చేస్తున్నాం. చిన్న సినిమా కనుక దయచేసి అందరూ థియేటర్లకు వెళ్లి చూడండి' అని కోరారు నిర్మాత నాగప్రసాద్. ఈ కార్యక్రమంలో హీరో అభిరామ్, హీరోయిన్ వెన్నెల, తెలుగు నిర్మాతలమండలి కార్యదర్శి ప్రసన్నకుమార్, దర్శకుల సంఘం అధ్యక్షుడు వీరశంకర్ తదితరులు పాల్గొన్నారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/cyup3CB లో చదవండి.

పనిచేయించుకోవటం మన హక్కు

విజయనగరం: ప్రభుత్వంలో ప్రజా సమస్యల పరిష్కరించుకోవటం ప్రజల హక్కని జనసేన నాయకుడు రవికుమార్ అన్నారు. బుధవారం గంట్యాడ మండలంలోని వివిధ గ్రామాల్లో పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు రాష్ట్ర మంత్రిగా కీలకమైనా పంచాయతీజ్, గ్రామీణాభివృద్ధి శాఖలు అందించిన కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తిస్తున్నామన్నారు. తాగునీరు, రోడ్లు వంటి మౌలిక సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యం ఇస్తామన్నారు.

విత్తనశుద్ధితో అధిక లాభాలు

బాడంగి: మండలంలోని ముగడ, పిన్నవలస గ్రామాల్లో ఆర్‌బీకేలను వ్యవసాయాధికారి కే.శిరీష సందర్శించి అక్కడి రైతులకు ఖరీఫ్ వరిసాగుపై అవగాహన కల్పించారు. అనంతరం బీజామృతంతో వరి విత్తనాలు శుద్ధిచేయించారు. విత్తనశుద్ధి చేసి నాటుకోవడం వల్ల తెగుళ్ల బారినుంచి రక్షణ ఉంటుందన్నారు. అలాగే పిన్నవలస గ్రామంలో వైస్ ఎంపీపీ బాస్కరరావు చేతులమీదుగా నవధాన్యాల కిట్లను అందజేశారు. గ్రామ పెద్దలు, ఆర్‌బీకే సిబ్బంది, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మరిడిమాంబకు ప్రత్యేక పూజలు

లక్కవరపుకోట: మండలంలోని రంగారాయపురం గ్రామంలో గల మరిడిమాంబకు మాజీ జెడ్పీటీసీ కరెడ్ల ఈశ్వరరావు దంపతులు బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వార్షికోత్సవం సందర్భంగా గ్రామస్థులు అమ్మవారికి పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. వినాయక, నవగ్రహ, రాహుకేతువుల పూజలను ఘనంగా నిర్వహించారు. అనంతరం కుంకుమ పూజ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ రామలక్ష్మీ దంపతులు, జగన్నదొర, కాశీవిశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి

విజయనగరం రింగురోడ్డు: సచివాలయాల ద్వారా ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించే విధంగా చూడాలని కార్యదర్శులకు నగర పాలక సంస్థ కమిషనర్ ఎంఎం నాయుడు ఆదేశించారు. బుధవారం నగరంలోని వివిధ సచివాలయాలను తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు, ప్రజా ఫిర్యాదుల నమోదు, రిజిస్టర్ నిర్వహణ, అందిస్తున్న పౌర సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదులను స్వీకరించి వాటి పరిష్కారానికి చొరవ చూపాలని కార్యదర్శులను ఆదేశించారు. ప్రధాన రహదారులు, వీధుల్లో భవన వ్యర్థాలు వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఆచంట గార్డెన్స్ నిర్వహణ తీరును పరిశీలించారు.

'నేను బడికిపోతా'పై అవగాహన

జామి: మండల కేంద్రమైన జామి భవిత సెంటర్‌లో మండల విద్యాశాఖాధికారి జయశ్రీ ఆధ్వర్యంలో నేను బడికిపోతా కార్యక్రమంపై బుధవారం దివ్యాంగ పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖాధికారి-2 గంగరాజు మాట్లాడుతూ ఈకార్యక్రమం ద్వారా గ్రామాల్లో దివ్యాంగ పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేరుస్తామన్నారు. ఇప్పటి వరకు 21మంది దివ్యాంగులను గుర్తించి.. వారి వయస్సులను బట్టి పాఠశాలలు, అంగన్వాడీల్లో చేర్పించామన్నారు.

రోగులకు పండ్ల పంపిణీ

బొబ్బిలి: ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ జన్మదినం సందర్భంగా స్థానిక సీహెచ్‌సీలో ఆ పార్టీ నాయకులు బుధవారం రోగులకు పండ్లు, పాలు, రొట్టెలు పంపిణీ చేశారు. పీసీసీ అధికార ప్రతినిధి మువ్వల శ్రీనివారావు ఆధ్వర్యంలో డాక్టర్ గేదెల శశిభూషణరావు రోగులకు వాటిని అందజేశారు.

ప్రజాధనం అంటే అంత అలుసా?

బొబ్బిలి: బొబ్బిలి-రామభద్రపురం రాష్ట్రీయ రహదారిలో పారాది వేగావతిపై ఏమాత్రం నాణ్యత లేని నాశిరకం కాజ్‌వే నిర్మించిన వారి నుంచి ప్రజాధనాన్ని రికవరీ చేయాలని లోక్‌సత్తా జిల్లా పార్టీ అధ్యక్షుడు ఆకుల దామోదరరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బ్రిటీష్ కాలంనాటి వంతెన కుంగిపోయిన కారణంగా వాహనాల రాకపోకల కోసం నదిలో 95 లక్షల రూపాయలతో కాజ్ వే నిర్మించారని, అది తొలి వర్షానికే కొట్టుకుపోవడం సిగ్గుచేటన్నారు. ఈ ఏడాది మార్చిలో రోడ్డును అత్యంత పేలవంగా, నాణ్యత లేకుండా నిర్మిస్తున్న సమయంలో తాము వెళ్లి పరిశీలించి రోడ్డు నిర్మాణంలోని డొల్లతనంపై హెచ్చరించామన్నారు. అయినప్పటికీ ఎవరూ పట్టించుకోలేదన్నారు. నాశిరకం రోడ్డు నిర్మించి దానిని వెనువెంటనే గంగలో కలిపేసిన బాధ్యులైన వారందరి నుంచి సొమ్మును రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. డి.సురేష్ పాల్గొన్నారు.

భోజనం తనిఖీ

రేగిడి: పనసలవలస హైస్కూల్‌లో బుధవారం మధ్యాహ్న భోజనం అమలు తీరును ఎంఈవో వరప్రసాదరావు తనిఖీ చేశారు. పాఠశాల పరిస్థితులపై హెచ్ఎం సునీతతో సమీక్షించారు. బడికి పోతా కార్యక్రమం సర్వే తీరు, విద్యార్థులను చేర్పించటంపై సూచనలిచ్చారు.

శిక్షణ తరగతులను విజయవంతం చేయాలి

బొబ్బిలి: వచ్చేనెల 8 నుంచి 10 వరకు కాకినాడలో జరగనున్న ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర విద్యా, వైజ్ఞానిక, రాజకీయ శిక్షణ తరగతులను విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.నాగభూషణం పిలుపునిచ్చారు. స్థానిక గంటి ప్రసాదం స్మారకభవనంలో బుధవారం నిర్వహించిన నియోజకవర్గస్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతరం బొబ్బిలి డివిజన్ సమితి నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

ల్యాండ్ టైటిలింగ్ చట్టం రద్దుపై హర్షం

బొబ్బిలి: ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు బాధ్యతలు స్వీకరించిన వెంటనే తొలి ఐదు సంతకాల్లో ఒకటి ల్యాండ్ టైటలింగ్ యాక్టు రద్దుపై చేయడం చాలా హర్షనీయమని బొబ్బిలి బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పి.మోహనమురళీకుమార్, కొల్లి సింహాచలం అన్నారు. బుధవారం నిర్వహించిన బార్ సమావేశంలో ఈ మేరకు తీర్మానం చేశారు. జిల్లా టీడీపీ న్యాయవిభాగం ఉపాధ్యక్షుడు, సీనియర్ న్యాయవాది చల్లారపు సత్యనారాయణ, స్వామినాయుడు తదితరులున్నారు.

బకాయిలు చెల్లించకపోతే షాపులకు తాళాలు

రాజాం: మొండి బకాయిలు చెల్లించని షాపులకు తాళాలు వేయక తప్పదని పురపాలక సంఘం కమిషనర్ రామప్పలనాయుడు హెచ్చరించారు. బుధవారం రాత్రి మొండి బకాయిలు చెల్లించని షాపులను తనిఖీ చేశారు. ఒక్కో షాపు యజమాని లక్షల్లో బకాయిలు ఉండటంతో ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఉన్న రెండు షాపులకు సిబ్బంది సమక్షంలో తాళాలు వేశారు. అయితే షాపులకు సంబంధించి కోట్లలో బాకయిలు ఉన్నాయని కొంత మంది షాపుల యజమానులు తప్పించుకోవడానికి ప్రయత్నిస్తున్నారని, ఎవరినీ వదిలి పెట్టేది లేదన్నారు. ఆర్ఐ రమణ, ఏఈ వెంకటరామరాజు ఉన్నారు.

మొక్కల పెంపకంపై దృష్టి

రాజాం: మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏపీడీ శ్రీనివాసరావు సిబ్బందిని ఆదేశించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు.

కూల్చేశారు.. మరి కట్టిస్తారా..?

● పోలీస్ క్వార్టర్స్ నిర్మాణంపై అనుమానాలు ● అద్దె ఇళ్లల్లో పోలీస్ యంత్రాంగం ● హోం మినిస్టర్‌పైనే ఆశలన్నీ



1996లో వేసిన శిలాఫలకం

రాజాం రూరల్, జూన్ 19: నగర నడిబొడ్డున కోట్లాది రూపాయల విలువ చేసే పోలీస్ క్వార్టర్స్ స్థలం నిరుపయోగంగా మారింది. పాత భవన సముదాయాన్ని కూలదోసి మూడేళ్లు గడుస్తున్నా నిర్మాణం పనులు ప్రారంభం కాకపోవడంతో స్థలం చేతులు మారుతుందన్న అనుమానాలు రేకెత్తుతున్నాయి. పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో 1996లో అప్పటి హోం మినిస్టర్ ఎలిమినేటి మాధవరెడ్డి ఎస్.ఐ. కోసం ఓ భవనం, పోలీస్ సిబ్బంది కోసం గృహ సముదాయాన్ని ప్రారంభించారు. కాలక్రమంలో భవన సముదాయం శిథిలావస్థకు చేరింది. దీంతో పోలీస్ సిబ్బంది అద్దె కొంపల్లోకి చేరాల్సి వచ్చింది.

● స్థలంపై అనుమానాలు..

2020వ సంవత్సరంలో పోలీస్ క్వార్టర్స్ కూల్చివేసినా అక్కడ భవన సముదాయ నిర్మాణం పనులు ప్రారంభం కాకపోవడంతో కోట్లాది రూపాయలు విలువచేసే ఈ స్థలంపై అనుమానాలు రేకెత్తుతున్నాయి. ఈ స్థలాన్ని ఓ పారిశ్రామికవేత్తకు అప్పగిస్తారన్న ప్రచారం పట్టణంలోని అన్ని వర్గాల ప్రజల నుంచి వినిపిస్తోంది. గతంలో ఈ స్థలాన్ని కొలతలు వేసే సమయంలో ఆ ప్రముఖ గ్రూపునకు చెందిన వ్యక్తులు ఉండడం ఇందుకు బలం చేకూరింది.

● ఏడు కిలోమీటర్ల దూరంలో..

రాజాం పట్టణానికి సుమారు ఏడు కిలోమీటర్ల దూరంలో పోలీస్ క్వార్టర్స్ నిర్మాణానికి ఉమ్మడి శ్రీకాకుళం ఎస్పీ గతంలో స్థలం కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఎస్పీతో పాటు స్థలాన్ని రెవెన్యూ, పోలీస్ ఉన్నతాధికారులు పరిశీలన చేశారు. అయితే కనీస సౌకర్యాలు లేని ఈ ప్రాంతంలో క్వార్టర్స్ నిర్మాణాన్ని వ్యతిరేకిస్తూ పోలీస్ యంత్రాంగం నిరసన వ్యక్తం చేసింది. పాత స్థలంలోనే నూతన భవన సముదాయం నిర్మించాలన్న డిమాండ్ పోలీస్ వర్గాల నుంచి తెరపైకి వచ్చింది. దీనికితోడు గత వైసీపీ ప్రభుత్వం కొట్టడాలే తప్ప కట్టడాలు చేపట్టకపోవడంతో తదుపరి చర్యలు ముందుకు సాగలేదు. ఇదిలా ఉంటే సువిశాలమైన స్థలం మెయిన్‌రోడ్‌లో ఖాళీగా ఉండడంతో అసాంఘిక కార్యక్రమాలకు కేంద్రబిందువైంది.



పోలీస్ గృహ సముదాయాన్ని కూలదోస్తున్న దృశ్యం (ఫైల్)

● అద్దె ఇళ్లల్లోనే..

రాజాం టౌన్, రూరల్ స్టేషన్ల సర్కిల్ ఇన్‌స్పెక్టర్లతో పాటు పోలీసులు అద్దె ఇళ్లల్లో నివశిస్తున్నారు. గతంలో ఒకేచోట ఉండే వారంతా చెల్లాచెదురయ్యారు. ఒకే ప్రాంతంలో సమిష్టిగా కష్టసుఖాల్లో కలిసిమెలిసి ఉండాల్సిన పోలీస్ వర్గాలు అందుకు విరుద్ధంగా జీవనం సాగిస్తున్నారు. పాత భవన సముదాయ ప్రాంతంలోనే క్వార్టర్స్ నిర్మాణం జరపాలన్న డిమాండ్ బలంగా వినిపిస్తోంది. రాష్ట్రంలో తెలుగు దేశం ప్రభుత్వం అధికారంలోకి రావడం, హోంమినిస్టర్‌గా వంగలపూడి అనిత బాధ్యతలు చేపట్టడంతో పోలీస్ వర్గాల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి.

శాంతి భద్రతల సమస్యలు రాకూడదు

● సమష్టి కృషితో ప్రశాంతంగా ముగిసిన సార్వత్రిక ఎన్నికలు

విజయనగరం క్రైమ్, జూన్ 19: జిల్లాలోని పోలీస్ స్టేషన్ల పరిధిలో శాంతి భద్రతల సమస్యలు ఉత్పన్నం కాకుండా చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు ఎస్పీ దీపిక ఆదేశించారు. బుధవారం జిల్లా పోలీస్ కార్యాలయ సమావేశం మందిరంలో పోలీస్ అధికారులతో మాసాంత నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలు ఓట్ల లెక్కింపు ప్రక్రియ సమిష్టి కృషితో సమన్వయంతో పనిచేయటం వలన ప్రశాంతంగా ముగిసిందన్నారు. విధి నిర్వహణలో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ఎన్నికల కమిషన్ పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాలతో ఎటువంటి అల్లర్లు జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టారన్నారు. తీవ్రమైన నేరాల్లో నమోదైన కేసులను త్వరగా పరిష్కరించాలన్నారు. ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వర్తించిన అధికారులు, సిబ్బందిని అభినందించి సత్కరించారు. ఈ సమావేశంలో ఏఎస్పీ ఆస్మాపరహీన్, ఎంఎం సోలమన్, డీఎస్పీలు గోవిందరావు, శ్రీనివాసరావు, చక్రవర్తి, వీరకుమార్, విశ్వనాథ్, యూనివర్స్ న్యాయ సలహాదారు పరశురామ్ తో పాటు సీఐలు, ఎస్సైలు, ఆర్ఎస్సైలు సిబ్బంది పాల్గొన్నారు.



ఏఎస్పీ ఆస్మా పరహీన్‌ను అభినందిస్తున్న ఎస్పీ దీపిక

విపత్తులపై అవగాహన పెంచాలి

కలెక్టరేట్, జూన్ 19: విపత్తులు సంభవించినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే అంశాలపై ప్రజలందరికీ అవగాహన కలిగించాలని డీఆర్వో అనిత తెలిపారు. బుధవారం జాతీయ విపత్తుల బృందంతో ఆమె చాంబర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని పలు ప్రాంతాలను అవగాహన సదస్సుల కోసం ఎంపిక చేశామని, షెడ్యూల్ ప్రకారం అక్కడి ప్రజలంతా ఈ అవగాహన సదస్సుల్లో పాల్గొనేలా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. జాతీయ విపత్తులు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించడానికి 2024 -25లో భాగంగా ఎన్‌డీఆర్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ డ్యూటీ ఎస్‌కే బెహర అధ్యక్షతన 16 మంది సిబ్బందితో కూడిన బృందం విజయనగరం జిల్లాలో విపత్కర పరిస్థితులు అధికంగా సంభవించు గ్రామాల్లో అవగాహన కల్పించేందుకు ఈనెల 18 నుంచి వచ్చే నెల 4వ వరకూ పర్యటించనున్నట్లు తెలిపారు. వరదలు, తుపాన్లు, అగ్ని ప్రమాదాలు, భూకంపాలు, గుండెపోటు సంభవించేటప్పుడు, పిడుగులు పడే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామాల్లో అవగాహన కలిగిస్తారని తెలిపారు. సమావేశంలో జిల్లా విపత్తుల శాఖ పీడీ తారక రామరావు చెప్పారు.



మాట్లాడుతున్న డీఆర్వో అనిత

భోజనంలో నాణ్యత లేకపోతే కఠిన చర్యలు

రామభద్రపురం: పాఠశాల విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యత లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని డిప్యూటీ డీఈవో కే.మోహనరావు హెచ్చరించారు. మండల కేంద్రంలో ఉన్న జిల్లా పరిషత్ హైస్కూల్‌ను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆహార పదార్థాలను పరిశీలించారు. రుచికరంగా వంటలు చేయాలని ఏజెన్సీ నిర్వాహకులకు సూచించారు. చిన్న గుడ్లు వచ్చినట్లు అయితే ఫిర్యాదు చేయాలని, వాటిని తిరస్కరించాలని స్పష్టం చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజన పథకంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. అక్కడ ఉన్న గోరుముద్ద బోర్డును చూసి పీఎం పోషణగా మార్చాలని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కర్రి భాస్కర రావును ఆదేశించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు ఆమిడి తిరుమలప్రసాద్, పెంటయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజన వంటలు రుచి చూస్తున్న డిప్యూటీ డీఈవో

ప్రశ్నలే మిగిలాయి.. పనులేవి?

● వాడివేడిగా ఎల్.కోట మండల సమావేశం

లక్కవరపుకోట, జూన్ 19: మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో సభ్యులడిగిన ప్రశ్నలకు అధికారుల నుంచి సమాధానం లేక తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ సభను ముగించారు. బుధవారం ఎంపీపీ గేదెల శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన మండలి సమావేశంలో సభ్యులు పలు సమస్యలపై అధికారులను నిలదీశారు. గత సమావేశంలో అడిగి న ప్రశ్నలకు ఇంతవరకు సమాధానం లేదని చందులూరు ఎంపీటీసీ కిశోర్, వ్య వసాయ విద్యుత్ శాఖాధికారులను నిలదీశారు. గంగుబూడి విద్యుత్ సమస్య నేటికీ తీరలేదని సర్పంచ్ ఆవేదన చెందారు. గోల్డ్‌స్టార్ మార్గంలో దొంగలు హల్‌చల్ చేస్తున్నా పోలీసులు పట్టించుకోలేదని రేగ ఎంపీటీసీ బి.గణపతి నిల దీశారు. ఈ సమావేశానికి పోలీసులను ఎందుకు రమ్మనలేదని అడిగారు. విత్త నాలు 1121, 1224, 1318, సాంబ, సోనా మసూరి రకం విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని ఏవో స్వాతి తెలిపారు. ఇంతవరకు డమ్మీ సభ్యులను అనుమతించి ఈ సమావేశానికి అనుమతించకపోవడంతో కొంతమంది వైసీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రూపేష్, తహసీల్దార్ ప్రసాద్, ఇతర మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



మండల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్

ఉపాధ్యాయుడికి పురస్కారం

విజయనగరం దాసన్నపేట: జిల్లా కేంద్రంలోని కంచెర్ల ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న పొట్నా శ్రీనివాసరావు నేషనల్ ఎక్స్‌లెన్స్ పురస్కారం అందుకున్నారు. ఢిల్లీలోని అదితీలా ఫౌండేషన్ వారు మంగళవారం నిర్వహించిన పార్లమెంటు సభ్యుల సన్మాన కార్యక్రమంలో ఉపాధ్యాయుడు శ్రీనివాసరావును ఆధ్యాత్మిక గురువు, స్వామిజీ ఎంపీ సింహాద్రి, సంస్థ ప్రతినిధులు ఎస్.ఆదినారాయణ, డాక్టరు రాజా తాడూల్కర్ సమక్షంలో ఈ అవార్డు అందుకున్నారు. విద్యా రంగంలో శ్రీనివాసరావు సేవలను గుర్తించి అవార్డుకి ఎంపిక చేశారు. ఆయనను ఉపాధ్యాయ సంఘ నేతలు, ఉపాధ్యాయులు, నగర ప్రముఖులు అభినందించారు.



స్వామిజీ చేతుల మీదుగా అవార్డుని అందుకుంటున్న శ్రీనివాసరావు మాస్టారు

ఎక్కువ కేసుల రాజీకి సహకరించాలి

రాజాం రూరల్: జాతీయ లోక్‌అదాలత్‌లో వీలైనన్ని ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా అన్నిశాఖల అధికారులు కృషి చేసి సహకరించాలని మండల న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షులు, సీనియర్ న్యాయాధికారి సీహెచ్. వివేక్ ఆనంద్ శ్రీనివాస్ సూచించారు. ఇక్కడి కోర్టు సముదాయంలో జూనియర్ న్యాయాధికారి పి.ఎస్.వి.బి. కృష్ణ సాయితేజతో కలిసి పోలీస్, రెవెన్యూ, బ్యాంకింగ్ అధికారులు, చిట్‌ఫండ్ సంస్థల నిర్వాహకులతో పాటు బ్యాంక్, చిట్‌ఫండ్ సంస్థల న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..లోక్‌అదాలత్‌లో ఇరుపార్టీల అంగీకారంతో రాజీ చేసుకోవచ్చని స్పష్టం చేశారు. రాజాం రూరల్ సీఐ ఎస్.శ్రీనివాసరావు, సెబ్ ఎస్.ఐ. చంద్రశేఖరరావు, సంతకవిటి డిప్యుటీ తహసీల్దార్ రంజిత్ కుమార్, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

కొత్తవలస: న్యాయవాదులు, పోలీసులు ఎక్కువ కేసులు రాజీ చేయడానికి ప్రయత్నం చేయాలని కొత్తవలస జూనియర్ సివిల్ జడ్జి డాక్టర్ ఎస్.విజయచందర్ సూచించారు. బుధవారం ఉదయం కొత్తవలస కోర్టు పరిధిలో గల మూడు మండలాలకు చెందిన పోలీసు అధికారులు, ఎక్సైజ్ స్టేషన్, న్యాయవాదులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 29న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు తెలిపారు. న్యాయవాదులు సీహెచ్ రామచంద్రప్రసాద్, ఎంవీఎస్ గిరిబాబు, ఎన్.శ్రీరామమూర్తి, ఒ.వి.మురళీకృష్ణ, డి.శ్రీనివాస్, సీఐ వి.చంద్రశేఖర్, ఎక్సైజ్ సీఐ రాజేశ్వరి పాల్గొన్నారు.



కొత్తవలస, రాజాంలో మాట్లాడుతున్న న్యాయాధికారులు

అంబేడ్కర్ పేరుపై అభినందన

శృంగవరపుకోట: అంబేడ్కర్ విదేశీ విద్యగా ప్రభుత్వం పేరు పెట్టడంపై స్థానిక దళిత నాయకులు అనకాపల్లి చెల్లయ్య, సోంగ కృష్ణ హర్షం వ్యక్తం చేశారు. బుధవారం ఎల్.కోటలో ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారిని కలిశారు. ఈ మేరకు ఎమ్మెల్యేతో పాటు సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ పథకానికి వైఎస్ఆర్ విదేశీ విద్యాదీవెన అనే పేరు ఉన్న సంగతి తెలిసిందే.



ఎమ్మెల్యే లలిత కుమారికి కృతజ్ఞతలు చెబుతున్న దళిత నాయకులు


డిగ్రీ కళాశాలలో నైపుణ్య శిక్షణ

శృంగవరపుకోట: శృంగవరపుకోట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ప్రిన్సిపాల్ సీహెచ్ కేశవ రావు తెలిపారు. జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సుల్లో శిక్షణకు ఇంటర్, డిగ్రీ, పీజీ పూర్తి చేసిన వారు అర్హులని తెలిపారు. మూడు నెలల వ్యవధి గల ఈ కోర్సుల్లో చేరేందుకు ఈ నెల 24వరకు అవకాశం ఉందన్నారు. వివరాలకు 9000234642, 7995691295 నెంబర్లను సంప్రదించాలని సూచించారు.

సికిల్‌సెల్ ఎనీమియా నిర్మూలనే లక్ష్యం

● డీఎంహెచ్‌వో భాస్కరరావు

విజయనగరం రింగురోడ్డు: సికిల్‌సెల్ ఎనీమియాను 2047 నాటికి పూర్తిగా నిర్మూలించే దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని డీఎంహెచ్‌వో డాక్టర్ ఎస్.భాస్కరరావు పిలుపునిచ్చారు. సికిల్‌సెల్ ఎనీమియా డేను పురస్కరించుకుని బుధవారం కంటోన్మెంట్‌లోని గిరిజన సంక్షేమ బాలికల ఉన్నత పాఠశాలలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ గిరిజన ప్రాంతాల్లో ఉన్న 40 ఏళ్ల వయస్సులోపు వారికి అవగాహన కల్పించి, రక్త పరీక్షలు చేయడం, అవసరమైన వారికి కౌన్సిలింగ్ నిర్వహించడమే లక్ష్యంగా మిషన్ పని చేస్తుందన్నారు. తల్లిదండ్రుల నుంచి లోపభూయిష్టమైన జన్యువు వారి పిల్లలకు వచ్చినప్పుడు సికిల్‌సెల్ ఎనిమియాకు దారి తీస్తుందన్నా రు. ఈ వ్యాధి వచ్చిన వారిలో రక్తహీనత, కళ్లు పసుపు రంగులోకి మారడం, తీవ్రమైన ఒళ్లు నొప్పులు వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉందన్నారు. వైద్య సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు. ● **జామి:** జట్టేడివలస సచివాలయం పరిధిలో బుధవారం సికిల్‌సెల్ ఎనీమియాపై పంచాయతీ కార్యదర్శి కుమారి ఆధ్వర్యంలో గ్రామస్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ ఈ వ్యాధి లక్షణాలు, నిర్ధారణ పరీక్ష, చికిత్స విధానాలను వివ రించారు. వైద్య ఆరోగ్య సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు. ● **రేగిడి:** సికిల్‌సెల్ ఎనీ మియా అత్యంత ప్రమాదకారి అని... దీని సమూల నిర్మూలనే లక్ష్యం కావాలని రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారులు సీహెచ్ అసిరినాయుడు, డాక్టర్ సోఫ్ని పేర్కొన్నారు. స్థానిక పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సికిల్‌సెల్ ఎనీమియాపై బుధవారం రేగిడిలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో ర్యాలీ నిర్వహించా రు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో సుందరేశ్వరావు, హెల్త్‌విజిటర్ పుష్ప, ఏఎన్ఎం జ్యోతి తదితరులు పాల్గొన్నారు. ● **వేపాడ:** స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సికిల్‌సెల్ ఎనీమియాపై బుధ వారం అవగాహన సదస్సు నిర్వహించారు. హెల్త్ సూపర్‌వైజర్ రమణ, వెలుగు సీసీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో భాస్కరరావు

బొడ్డాంలో ఉద్రిక్తత

● పోలీస్ పికెట్ ఏర్పాటు ● పలువురికి గాయాలు

రాజాం రూరల్, జూన్ 19: మండల పరిధిలోని బొడ్డాం గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేసినట్లు ఏఎస్ఐ బాస్కర్రావు తెలిపారు. ఈనెల 18న రాత్రి అసిరితల్లి వారాల ముగింపు సందర్భంగా గ్రామంలో ఊరేగింపు సందర్భంగా రెండు పార్టీలకు చెందిన వ్యక్తుల మధ్య చోటుచేసుకున్న వివాదం చిలికి చిలికి గాలివానగా మారిందని ఫలితంగా కొంతమంది గాయపడ్డారని ఆయన వివరించారు. ఏఎస్.ఐ. భాస్కర్రావు అందించిన సమాచారం ప్రకారం.. అసిరితల్లి ఉత్సవాల సందర్భంగా ఊరేగింపు జరుపుతుండగా బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తులు ఎస్సీ వీధి మహిళలతో అసభ్యంగా ప్రవర్తించినట్లు, ఆమేరకు మహిళలు ప్రశ్నించగా.. అల్లు రమణతో పాటు కొంతమంది కులం పేరుతో దూషించి కొట్టినట్లు పాముల దేవి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పేర్కొన్నారు. గాయపడిన పాముల దేవి, అగిరేడు వీరస్వామి, గుమ్మడి ప్రసాద్‌లను వైద్య చికిత్స కోసం రాజాం సామాజిక ఆసుపత్రిలో చేర్పించామన్నారు. అలాగే.. ఇదే ఉత్సవాల సందర్భంగా ఎస్సీ కాలనీలో చోటుచేసుకున్న వివాదంలో తమను కులంపేరుతో దూషించి, చేతులతో కొట్టినట్లు వన్నల రాము ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు. ఈఘటనలో గాయపడిన వన్నల రాము, జనార్దన్, అశిరినాయుడును రాజాం సామాజిక ఆసుపత్రిలో చేర్పించామన్నారు.



బొడ్డాంలో పికెటింగ్ నిర్వహిస్తున్న పోలీసులు

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

గుర్ల/గజపతినగరం, జూన్ 19: గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్టు రైల్వే ఎస్ఐ రవివర్మ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం కోమటిపల్లి గజపతినగరం రైల్వే స్టేషన్ల మధ్య గజపతినగ రానికి సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి మృతిచెందాడని తెలిపారు. పట్టాలు దాటుతుండగా లేదా రైలు నుంచి జారి పడి మృతిచెంది ఉంటాడని అనుమానిస్తున్నట్టు ఆయన తెలిపారు. మృతుడి వయస్సు 45 సంవత్సరాలు ఉంటుందని, మృతదేహాన్ని విజయనరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి కేసు నమోదుచేసినట్టు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు 94906 17089, 94918 13163 నెంబర్లకు సంప్రదించాలని ఆయన తెలిపారు.

మలేరియా మాసోత్సవ ర్యాలీ

శృంగవరపుకోట: శృంగవరపుకోట పట్టణంలో బుధవారం కొట్టాం పీహెచ్‌సీ సిబ్బంది మలేరియా మాసోత్సవ ర్యాలీ నిర్వహించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని నినాదాలు చేశారు. వైద్యాధికారి బి.శిరీష, సిబ్బంది బి.సన్యాసిరావు, వి.సన్యాసినాయుడు, టి.రామకృష్ణ, టి.శంకరరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడికి అభినందన

కొత్తవలస: తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా నియమితుడైన పల్లా శ్రీనివాస్‌ను బుధవారం కొత్తవలసకు చెందిన పద్మశాలి సామాజిక వర్గం నాయకులు విశాఖలో కలిసి అభినందనలు తెలిపారు. మాజీ ఏజీపీ గొడుగుల మహేంద్ర, న్యాయవాది ఎన్‌వీ సత్యనారాయణ, తెలుగుదేశం పార్టీ మండల నాయకుడు పప్పు అప్పలరాజు, మరికొంత మంది నాయకులు కలిసారు. తెలుగుదేశం పార్టీ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని ఆయనకు తెలిపారు.

'నేను బడికి పోతా'పై అవగాహన

శృంగవరపుకోట: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం 'నేను బడికి పోతా 'కార్యక్రమాన్ని నిర్వహించారు. బడిఈడు పిల్లలందరూ పాఠశాలలో ఉండేందుకు అధికారులు సహకరించాలని ఎంఈవో నర్సింగరావు, పీజీ లక్ష్మిలు కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సాంబశివరావు, తహసీల్దార్ కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఏయూ టాపర్ రమ్యకు అభినందన

విజయనగరం దాసన్నపేట: నగరంలోని డకినివీధికి చెందిన కొమ్మూరు రమ్య (బీబీఏ) డిగ్రీలో 9.7 మార్కులతో ఏయూ టాపర్‌గా నిలిచారు. బుధవారం విజయనగరం యూత్ ఫౌండేషన్, విజయదుర్గా యూత్ సొసైటీ ఆధ్వర్యంలో రమ్యకు విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు అభినందించారు. ఆటో డ్రైవర్‌గా జీవనం కొనసాగిస్తున్న తండ్రి కష్టపడి వారి పిల్లలను ఈ స్థాయిలో చదివించడం గొప్ప విషయమని అన్నారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

అధ్వానంగా తాటిపూడి రెసిడెన్షియల్ పాఠశాల

శృంగవరపుకోట రూరల్: తాటిపూడి ఏపీఆర్‌జేసీ రెసిడెన్షియల్ బాలికల పాఠశాల అధ్వానంగా ఉందని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘ ప్రధాన కార్యదర్శి పురం అప్పారావు అన్నారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ పాఠశాలలో మరుగుదొడ్లు, స్నానపు గదులు దారుణంగా ఉండడంతో విద్యార్థినులు రోగాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రాత్రి వేళల్లో ఒక మహిళా వాచ్‌మెన్ మినహా ఎవరూ ఉండడం లేదన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు కిరణ్‌కుమార్, వెంకటరమణ, శంకరరావు మాట్లాడుతూ పాఠశా లపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. దీనిపై వివరణ కోరేందుకు పాఠశాల ప్రిన్సిపాల్‌కు ఫోన్ చేయగా ఆమె స్పందించలేదు.

సమస్య పరిష్కరించే వరకూ నిరసన

కొత్తవలస: జేఎస్ఎల్ కర్మాగార కార్మికులు బుధవారం నిరసన దీక్ష, వంటావార్పు కార్యక్రమాన్ని నిర్వహించారు. కర్మాగారంలో లాకౌట్‌ను ఎత్తి వేయాలని కోరుతూ ఇప్పటికే జిల్లాకు చెందిన మంత్రి కొండపల్లి శ్రీనివాస్, విశాఖ ఎంపీ ఎం.భరత్, స్థానిక శాసన సభ్యురాలు కోళ్ల లలితకుమారి, కలెక్టర్ నాగలక్ష్మికి వినతిపత్రాలను అందించారు. ఒక పక్క నాయకులు, అధికారులకు వినతిపత్రాలు ఇస్తూ మరో పక్క డీసీఎల్, జేసీఎల్ వద్ద చర్చలకు హాజరవుతున్నారు. కొత్తవలస, విజయనగరం జిల్లా కేంద్రంలో ఆందోళనలు ముమ్మరం చేస్తున్నారు. ఈ సందర్భగా కార్మిక సంఘాల జేఏసీ నాయకుడు పిల్లా అప్పలరాజు మాట్లాడుతూ న్యాయం కోసం అన్ని విధాలా ప్రయత్నిస్తున్నామని తెలిపారు. తమ సమస్య పరిష్కారమయ్యే వరకు ఆందోళన విరమించేది లేదన్నారు.

టిడ్కో గృహాలను పరిశీలించిన కమిషనర్

రాజాం: కంచరాం సమీపంలో టిడ్కో గృహాలను పురపాలక సంఘ కమిషనర్ రామప్పలనాయుడు బుధవారం పరిశీలించారు. ఎన్ని గృహాలు మంజూరయ్యాయో, ఎన్ని పూర్తయ్యాయో నివేదికలు సిద్ధం చేయాలని ఏఈ భాగ్యలక్ష్మి, వెంకటరామరాజును ఆదేశించారు. అనంతరం జగనన్న కాలనీ నిర్మాణాలను పరిశీలించారు. గృహ నిర్మాణ లబ్ధిదారుల ఇబ్బందులను తెలుసుకున్నారు. గృహ నిర్మాణాలకు అవసరైన సామగ్రి తేవడానికి కూడా అవకాశం లేని దుస్థితిలో రహదారి ఉందని.. దీని నిర్మాణ పనులు త్వరగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలని లబ్ధిదారులు కమిషనర్‌ను కోరారు. రహదారి త్వరగా పూర్తిచేసేలా చర్యలు తీసుకుంటామని కమిషనర్ రామప్పలనాయుడు వారికి హామీ ఇచ్చారు.

అనుమతిలేకుండా లేఅవుట్లు ఏర్పాటు

కురుపాం: కురుపాం పంచాయతీ పరిధిలో ఎటువంటి అనుమతి లేకుండా లేఅవుట్లు ఏర్పాటుచేస్తున్నారు.ఈనేపథ్యంలో కురుపాం పంచాయతీ పరిధిలో పూతిక వలస, కస్పాగదబవలస, శివ్వన్నపేట, కురుపాంల్లోగల లేఅవుట్‌ల్లో మే 23న పంచాయతీ, బుడా అను మతులు లేవని, క్రయవిక్రయాలు నిషేధం, చట్ట వ్యతిరేకమని, పంచాయతీరాజ్‌చట్టం-1994 ప్రకారం చర్యలు తీసుకోనున్నట్లు హెచ్చరిక బోర్డు ఏర్పాటుచేశారు.అయితే బోర్డు పెట్టిన కొద్దిరోజులకే మాయం కావడంతో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అనుమతి కోసం లేఅవుట్ నిర్వాహకులు ఇప్పటి వరకు పంచాయతీలోగాని బుడాఅనుమతికోసం ఎటువంటి దరఖాస్తులు చేయలేదని అధికారులు చెబుతున్నారు.రెండేళ్లుగా ఇలా హెచ్చరిక బోర్డులు ఏర్పాటుచేసిన తర్వాత కొద్దిరోజుల్లోనే మాయంకావడం విశేషం. గతంలో వైసీపీ నాయకులు అండదండలతో అనుమతి లేకుండా లేఅవుట్లువేసి అమ్మకాలు చేట్టినా అధికారులు చూసీచూడనట్లు వ్యవహరించారని అప్పట్లో ఆరోపణలొచ్చిన విషయం విదితమే. ఇప్పటికైన అధికారులు స్పందించి లేఅవుట్ డెవలపర్లకు నోటీసులిచ్చి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. కాగా లేఅవుట్ డెవలపర్లకు నోటీసులిచ్చామని, ఇప్పటివరకు ఎవ్వరు స్పందిచలేదని ఇన్‌చార్జి ఈవో చంద్రశేఖరరావు తెలిపారు. మళ్లీ నోటీసులు ఇస్తామని చెప్పారు.

'వారిని పార్టీ నుంచి బహిష్కరించాలి'

పార్వతీపురంటౌన్:పార్టీకి ద్రోహదంచేసిన మాజీ ఎమ్మెల్సీ ద్వారపురెడ్డి జగదీష్, మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు, మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ ద్వారపురెడ్డి శ్రీదేవి, వారి అనుచర గణాన్ని టీడీపీ నుంచి శాశ్వతంగా ముఖ్యమంత్రి చందబాబు బహిష్కరించాలని పార్వతీపురం మండల టీడీపీ నాయకులు కోరారు. బుధవారం పార్వతీపురంలో టీడీపీ అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షులు జి. వెంకటనాయుడు విలేకరులతో మాట్లాడుతూ పార్టీ ద్వారా ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, మునిసిపల్ చైర్‌పర్సన్, ఇతర అనుచరగణం అనేక పదవులను అనుభ వించారని, ఇటీవల జరిగిన ఎన్నికల్లో బోనెల విజయచంద్రను ఓడించేందుకు కుట్రపన్నడం బాధకరమన్నారు. బలిజిపేట టీడీపీ మండలాధ్యక్షులు పి. వేణుగోపాల్‌నాయుడు, పార్టీ సీతానగరం మండల ప్రధానకార్యదర్శి వేణుగోపాలనాయుడు మాట్లాడుతూ పార్టీని ముందుండి నడిపించాల్సినవారే నట్టేటా ముంచాలని, చూస్తే ఊరుకోనేది లేదన్నారు. తల్లివంటి పార్టీకి అన్యాయం చేస్తే పుట్టగతులు ఉండవని, ద్రోహనికి పాల్పడిన వారిని వెంటనే పార్టీ నుంచి తొలగించాలని పట్టణ ప్రధాన కార్యదర్శి మజ్జి వెంకటేష్‌తో పాటు నాయకులు బార్నాల సీతారామ్, బదరినారాయణ డిమాండ్ చేశారు.

పరిస్థితులు మార్చుకోండి

- సక్రమంగా విధులు నిర్వహించండి
- ఎంపీపీ సురేష్ హెచ్చరిక

జియ్యమ్మవలస: వివిధ శాఖల్లో పనిచేస్తున్న అధికారులు విధి నిర్వహణలో పరిస్థితులు మార్చుకోకపోతే తీవ్ర పరిణామాలు తప్పవని ఎంపీపీ బొంగు సురేష్ హెచ్చరించారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ తన చాంబర్‌లో ఎంపీడీవో శ్రీనివాసరావుతో కలిసి మండల స్థాయి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు తాను ఎంపీపీగా ఉన్నా తన పరిధిలో పనిచేసిన అధికారులు కనీసం పట్టించుకోకుండా వెళ్లిపోయే సందర్భాలు అనేకం ఉన్నాయన్నారు. ప్రధానంగా వెలుగు ఏపీఎం, సీసీలతో సమావేశం నిర్వహించాలని ఎంపీడీవో ద్వారా వర్తమానం పంపినా అప్పటి వైసీపీకి చెందిన ఓ మహిళ చెప్పిందని సమావేశానికి రాలేదని గుర్తు చేశారు. ఉపాధి హామీలో పూర్తి అవినీతి జరుగుతోందని, ఎక్కడెక్కడో ఉన్న వారి పేరున బిల్లులు డ్రా చేస్తున్న విషయం నాకు తెలియదా అంటూ ఏపీవో కలిశెట్టి శ్రీనును నిలదీశారు. ఇప్పుడు పరిస్థితులు మార్చుకోకపోతే మిమ్మల్ని ఆ దేవుడు కూడా కాపాడలేడని మండిపడ్డారు. జాగ్రత్తగా ఉండి సక్రమంగా విధులు నిర్వర్తించుకోవాలని హితవు పలికారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దత్తి లక్ష్మణరావు, అరకు పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ అధికార ప్రతినిధి డొంకాడ రామకృష్ణ, వైస్ ఎంపీపీ నరేష్, మండల పరిధిలో పనిచేస్తున్న వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

డీఎస్సీపై అనవసర రాద్ధాంతం తగదు

- కొమరాడ మండల టీడీపీ కన్వీనర్ ఉదయశేఖర్ పాత్రుడు

కొమరాడ: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే ఇచ్చిన మాట ప్రకారం డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తే కొంతమంది అనవసరమైన రాద్ధాంతం చేయడం తగదని టీడీపీ మండల కన్వీనర్ ఉదయశేఖర్ పాత్రుడు హితవుపలికారు. బుధవారం కొమరాడలో విలేకరులతో మాట్లాడుతూ పాఠశాలలు విలీనం కాకముందు 25 వేల పోస్టులు భర్తీ చేయవలసి ఉన్న మాట వాస్తవమేనని తెలిపారు. అయితే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జీవో-117 తీసుకువచ్చి పాఠశాలల విలీనం చేయడంతో పాఠశాలల సంఖ్య తగ్గడంతో పోస్టుల సంఖ్య తగ్గినట్లు చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రిగా చంద్రబాబునాయుడు తొమ్మిది డీఎస్సీలు నిర్వహించి 2,32,179 మంది ఉపాధ్యాయులను నియమించిన విషయం ప్రతి ఒక్కరూ గుర్తుం చుకోవాలన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు జగన్మోహన్‌రెడ్డి ప్రతి జనవరికి జాబ్ క్యాలెండర్, ప్రతి ఏడాది మెగా డీఎస్సీ నోటిఫికేషన్ ఇస్తామని అధికారంలోకి వచ్చిన తరువాత ఒక్క డీఎస్సీ కూడా నిర్వహించలేదని విమర్శించారు. తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే 16,347 పోస్టులు భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వడం పట్ల ప్రతి ఒక్కరూ హర్షం వ్యక్తం చేస్తున్నారని, కొంతమంది గిట్టని వారే అసత్య ప్రచారం చేపడుతున్నట్లు చెప్పారు. ఇప్పటికైనా వాస్తవాలను గుర్తించాలని ఆయన హితవుపలికారు.

పెద్దబగ్గలో గ్రామదేవత ఉత్సవాలు

సీతంపేట: మండలంలోని పెద్దబగ్గలో రాముడి కొండ అమ్మతల్లి గ్రామ దేవత ఉత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రతి ఏటా జరిగే ఉత్సవాలకు ఆదివాసీలు పెద్ద ఎత్తున హాజరై మొక్కులు చెల్లించుకుంటారు. పంటలు బాగా పండాలని, వర్షాలు కురవాలని, ప్రజలు ఎటువంటి అనారోగ్యాలకు గురికాకుండా ఉండాలని ఈ గ్రామ దేవత ఉత్సవాలను నిర్వహిస్తారు.

తోణాంకొత్తూరులో గంగమ్మ పండుగ

సాలూరు రూరల్: తోణాం కొత్తూరు (వడ్డివలస) ఎమ్మెల్యేగా గుమ్మిడి సంధ్యారాణి సాధించడంతోగ్రామదేవత గంగమ్మకు పండుగను స్థానికులు నిర్వహించారు. గ్రామస్థులు డప్పులతో గ్రామపొలిమేరకు వెళ్లి మొక్కులు చెల్లించారు. సంధ్యారాణి విజయం సాధించడమే కాకుండా మంత్రి కావడంతో పండుగ చేశామని గ్రామస్థులు తెలిపారు.

అచ్చెన్నకు అభినందన

పాలకొండ:వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును పాలకొండ మాజీ జెడ్పీటీసీ సామంతుల దామోదరరావు, టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుమ్మిడి సింహాద్రి తదితరులు బుధవారం అభినందించారు. నిమ్మాడలోని తన క్యాంప్ కార్యాలయంలో పుష్పగుచ్ఛం అందించారు. దుశ్శాలువ కప్పి సత్కరించి అభినందనలు తెలిపారు. వీరి వెంట పాలకొండ నియోజకవర్గ కూటమి నాయకులు ఉన్నారు.

కోటదుర్గమ్మ సన్నిధిలో జయకృష్ణ

పాలకొండ: పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ పట్టణంలోని కోటదుర్గమ్మ అమ్మవారిని బుధవారం దర్శించుకున్నారు. ఈవో బి.మురళీకృష్ణ, ప్రధాన అర్చకులు దార్లపూడి లక్ష్మీ ప్రసాదశర్మ స్వాగతం పలికి.. పూజలు చేశారు. అమ్మవారి చిత్రపటాన్ని, ప్రసాదాన్ని ఎమ్మెల్యేకు అందించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కరేన్న అప్పలనాయుడు, పట్టణ పార్టీ అధ్యక్షుడు గంటా సంతోష్‌కుమార్, కూటమి నాయకులు సుంకరి అనిల్‌దత్, అంపోలు శ్రీనివాసరావు, కౌన్సిల్ సభ్యుడు అడపా బాబ్జీనాయుడు, జవరాజు, సహాయ అర్చకుడు మణికుమార్ పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించండి

సాలూరు: తమ సమస్యలను పరిష్కరించాలని కాంట్రాక్ట్ విద్యుత్ ఉద్యోగులు కోరారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణికి తన నివాసంలో విద్యుత్ ఉద్యోగులు లోకేష్ ,జానకిరామ్, శంకర్,నరేష్, సత్యనారాయణ వినతి పత్రం అందజేశారు.

చేయూత లబ్ధిదారుల నిరసన

సీతానగరం (బలిజిపేట): జగనన్న చేయూత లబ్ధిదారులకు బ్యాంకు ఖాతాలో డబ్బులు ఎక్కడ ఉన్నాయని, వెంటనే సంబంధిత అధికారులు తెలియజేయాలని అధికారులను లబ్ధిదారులు ప్రశ్నించారు. ఈ మేరకు చేయూత డబ్బులు బ్యాంకు ఖాతాలో పడని లబ్ధిదారులంతా ఎంపీడీవో కార్యాలయం ముందు నిరసన తెలియజేసి ఈవోపీఆర్డీకి వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బొద్దాన భానుమూర్తి పాల్గొన్నారు.

సికిల్‌సెల్ ఎనీమియాపై అవగాహన

రాయగడ: రాయగడలోని ఆటానమస్‌కళాశాలలో బుధవారం సికిల్‌సెల్ ఎనీ మియాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ బాబిలత షారఫ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జువాలజీ అధ్యాపకులు ఆర్‌కే.స్వయి సికిల్ సెల్ ఎనీమియా వ్యాప్తి నిరోధక చర్యలపై తీసుకోవలసిన జాగ్రత్తలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో వివిధ విభాగాల అధ్యాపకులు సుబ్రత్‌కుమార్, శంభురౌత్ తదితరులు పాల్గొన్నారు.

మజ్జిగౌరి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం

రాయగడ: రాయగడ జిల్లా జిమిడిపేట మజ్జిగౌరిదేవి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం బుధవారం జరిగింది. దేవాలయ ట్రస్టీ జోగేశ్వరదాస్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బొడరాయ్‌సింగ్ గ్రామం నుంచి ఘటాల ఊరేగింపు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాలమీదుగా జరిగిన ఘటోత్సవంలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు రాంబాబు,గోవింద, కె.వెంకటి, మోహనరావు పాల్గొన్నారు.

రోడ్లపై మురుగు.. కాలువల్లో చెత్త

- గ్రామాల్లో దోమల స్వైరవిహారం
- ఇదీ మక్కువ మండలంలోని మార్కొండపుట్టి, వీరఘట్టం మండలంలోని విక్రంపురంలో పరిస్థితి



వీరఘట్టం: విక్రంపురం కాలువలో పూడికపోయిన చెత్త



మక్కువ: మార్కొండపుట్టిలో రహదారి మధ్యలో చేరిన నీరు

మక్కువ మండలంలోని మార్కొండపుట్టి, వీరఘట్టం మండలంలోని విక్రంపురంలో అధికారుల నిర్లక్ష్యం పుణ్యమాని రోడ్లపై మురుగునీరు చేరుతోంది. కాలువల్లో చెత్త పేరుకుపోతోంది. దీంతో గ్రామాల్లో దోమలు స్వైరవిహార చేస్తున్నాయి.

మురుగు పోయేందుకు దారిలేక..

మక్కువ: మండలంలోని మార్కొండపుట్టి హరిజన వీధిలో రహదారి మధ్యలో మురుగునీరు చేరడంతో గ్రామస్థులు ఇబ్బందిపడుతున్నారు. ఇక్కడ మురుగు నీరు బయటకు వెళ్లేందుకు మార్గం లేదు. దీంతో ఈ మార్గంలో రాకపోకలు చేసే వాహన చోద కులు, ప్రయాణికులకు అగచాట్లు తప్పడం లేదు. గతంలో వీధిలో సీసీరోడ్డు సగం వరకూ నిర్మించి, మిగతా చోట వదిలి వేయడంతో వర్షం కురిస్తే గోతుల్లో నీరు చేరుతుండడంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. మురుగునీరు నిల వల్ల దోమలు సైరవిహారం చేస్తుండడంతో అధికారులు స్పందించి మురుగునీరు బయటకు వెళ్లిపోయేందుకు ప్రత్యామ్నాయ మార్గం చూపాలని గ్రామస్థులు కోరుతున్నారు.

కాలువల్లో పూడికలు..

వీరఘట్టం: మండలంలోని విక్రంపురంలో ప్రధాన రహదారికి ఇరువైపులా వీధి కాలువలు పూడికలతో నిండిపోయాయి. దీంతో దోమలు ప్రబలి వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. నాలుగు వీధుల్లో ఉండే ఈ గ్రామంలో సుమారు వెయ్యి మంది నివసిస్తున్నారు. ఆ గ్రామం మీదుగా పార్వతీపురం-పాలకొండ ప్రధాన రహదారి వెళ్తుండడంతో నిత్యం రద్దీగా ఉంటోంది. వందలాది రాకపోకలు సాగిస్తుంటారు. ఈ నేపథ్యంలో గ్రామంలో నెలల తరబడి చెత్త, మురుగు కాలువల నుంచి తొలగించడంలేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడం,వ్యాధులు సీజన్ కావడంతో అధికారులు చొరవ తీసుకొని గ్రామంలోని వీధి కాలువల్లోని పూడికలు తొలగించాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయమై గ్రామ పంచాయతీ సెక్రటరీ డి.మణికంఠనాయుడును సంప్రదించగా పూడికలను తొలగించి కాలువలను శుభ్రం చేస్తామన్నారు.

రోగులను రిఫర్ చేయవద్దు

- గిరిజన, మహిళా శిశుసంక్షేమ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి



సాలూరు ఏరియా ఆసుపత్రిలో రోగులతో మాట్లాడుతున్న సంధ్యారాణి

సాలూరు: 'ఎటువంటి రోగులు వచ్చినా వైద్యం చేయాలి. ప్రైవేటు వైద్య శాలకు రిఫర్ చేస్తే సహించేది లేదు. మందులు కొరత ఉన్నా, మందులు లేక పోయినా నాకు చెప్పండి. నేను తెప్పిస్తా.గతంలా ప్రభుత్వాసుపత్రి ఉంటే క్షేమించే ప్రశక్తే లేదు. వైద్య శాలకు వచ్చిన ప్రతి ఒక్కరికి ఉచితంగా ప్రభుత్వ వైద్యం అందాల్సిందే. అందులో ఎలాంటి రాజీ లేదు'అని గిరిజన,మహిళా శిశుసంక్షేమ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. బుధవారం పట్టణంలోని ఏరియా ఆసుపత్రిని సందర్శించారు. వార్డుల్లో వైద్యసేవలు పొందుతున్న పలువురు రోగులతో మాట్లాడారు. అనంతరం నిర్మాణం జరుగుతున్న వంద పడకల ఆసుపత్రిని పరిశీలించారు. ఇంజనీరింగ్‌అధికారులు, కాంట్రాక్టర్లును పిలిచి ఆసుపత్రి నిర్మాణ మ్యాప్‌ను పరిశీలించారు. త్వరగా పనులు మొదలు పెట్టాలని, నిధులు మంజూరు చేయించే బాధ్యత తనదని తెలిపారు. అనంతరం వైద్య సిబ్బందితోపాటు పట్టణ ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఆసుపత్రిలోని సమస్యలు గురించి సూపరింటెండెంట్ రత్నకుమారి వివరించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆసుపత్రిలో 22 మంది వైద్యులు ఉండి మెరుగైన వైద్యంకోసం విజయనగరం రిఫర్‌చేయడం సరికాదన్నారు. ప్రైవేటు వైద్య శాలలకు రిఫర్ చేస్తే ఉపేక్షించే ప్రశక్తేలేదని హెచ్చరించారు. వైటీటీల్లో ఉన్న గిరిశిఖర గ్రామాల గర్భిణుల వసతి గృహాలు ప్రక్షాలన చేస్తామని తెలిపారు. ఫీడర్ అంబులెన్స్‌లకు సంబందించి వైద్య,ఆరోగ్యశాఖ మంత్రి దృష్టిలో, మహాప్రస్థానం వాహనం గురించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లానని చెప్పారు. కార్యక్రమంలో డీసీహెచ్‌ఎస్ గౌరీశంకరరావు,పట్టణ టీడీపీ నాయకులు నిమ్మాది తిరుపతిరావు, పిన్నింటి ప్రసాద్,ముఖీ సూర్యనారాయణ,కేతిరెడ్డి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

- **పాలకొండ:** మంత్రి గుమ్మడి సంధ్యారాణిని పార్వతీపురం, పాలకొండ ఎమ్మెల్యేలు బోనెల విజయచంద్ర, నిమ్మక జయకృష్ణ బుధవారం కలిశారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతా

- కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి



గరుగుబిల్లి: జగదీశ్వరిని అభినందిస్తున్న మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది

గరుగుబిల్లి:కొద్దిరోజుల్లో అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతానని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి తెలిపారు. బుధవారం గుమ్మలక్ష్మీపురంలో మండలపరిషత్ ఇన్‌చార్జి ఎంపీడీవో ఎస్. అర్జునరావు, సిబ్బంది జి.కృష్ణప్రసాద్, కులశేఖర్, బి.శ్రీనివాసరా వుతో పాటు పలువురు సిబ్బంది ఎమ్మెల్యేను అభినందించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మండల పరిషత్ సమస్యలను వివరించారు.

- **గుమ్మలక్ష్మీపురం:**ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి తిరుమల వేంకటేశ్వర స్వామిని కుటుంబ సమేతంగా బుధవారం దర్శించుకున్నారు. నియోజకవర్గం అభివృద్ధి చెందాలని, ప్రజలు సుభిక్షంగా ఉండాలని దేవుడిని ప్రార్థించినట్టు జగదీశ్వరి తెలిపారు.ఆమెవెంట నాయకులు పోలూరి శ్రీనివాసరావు, అడ్డాకుల నరేష్ ఉన్నారు.

వరహాలగెడ్డలో ఆక్రమణలు తొలగించాలి

- అధికారులను ఆదేశించిన పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర



వరహాలగెడ్డలో అక్రమ నిర్మాణాలను పరిశీలిస్తున్న విజయచంద్ర

పార్వతీపురం ఆంధ్రజ్యోతి/పార్వతీపురం టౌన్: వరహాల గెడ్డలో ఆక్రమణలు తొలగించాలని పార్వతీపురం ఎమ్మెల్యే విజయచంద్ర అధికారులను ఆదేశించారు. బుధవారం పార్వతీపురంలో వరహాలగెడ్డను రెవెన్యూ, ఇరిగేషన్‌శాఖ, పురపా లక సంఘ అధికారులతో కలిసి పరిశీలించారు. ప్రధానరహదారి పక్కన అనుమతిలేకుండా వర హాలగెడ్డలో అక్రమ నిర్మాణాలు జరుగుతుంటే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ఇరిగేషన్‌శాఖ అధికారులను ప్రశ్నించారు. అక్రమ నిర్మాణాలపై నోటీసు లిచ్చి తొలగించాలన్నారు. అనంతరం ఎమ్మెల్యేవిలేకరులతో మాట్లాడుతూ వరహాల గెడ్డలో ఆక్రమణపై నివేదికలు ఆధారాలతో సహా సర్వేనెంబర్లతో తయారు చేస్తామన్నారు. అక్రమార్కులు స్వచ్ఛందంగా ఆక్రమణలను విడిచిపెడితే వారికి ప్రభుత్వం నుంచి ప్రశంసాపత్రాలు అందజేస్తామన్నారు. కాగా ఎమ్మెల్యే అడిగిన ప్రశ్నలకు మునిసిపల్, ఇరిగేషన్ అధికారులు సరైన సమాధానం చెప్పలేని పరిస్థితి నెలకొంది.కార్యక్రమంలో టీడీపీనాయకులు బార్నాల సీతారాం, గొట్టాపు వెంకటనాయుడు, కోరాడ నారాయణరావు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ బెలగాం జయ ప్రకాష్‌నారాయణ ఇరిగేషన్, రెవెన్యూ, పురపాలక సంఘ అధికారులు పాల్గొన్నారు.

అపరిశుభ్రతపై ఆగ్రహం

పార్వతీపురం ఆంధ్రజ్యోతి: జిల్లా ఆసుపత్రి నుంచి ఇకపై ఇతర జిల్లాలకు రిఫరల్ ఉండకూడదని, ఇక్కడే మెరుగైన వైద్యం అందించాలని ఎమ్మెల్యే విజయ చంద్ర వైద్యులకు సూచించారు. ఆకస్మికంగా జిల్లా కేంద్రాసుపత్రిని పరిశీలించారు. ఆసుపత్రిలో అపరిశుభ్రత, రోగులు ఇబ్బందులపై సిబ్బందిపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తంచేశారు.అనంతరం వైద్యులతో సమీక్షించారు. జిల్లా కేంద్రాసుపత్రి భవనాలు వేగవంతంగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ వాగ్దేవి, వైద్యులు, వైద్య సిబ్బంది, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి సంజీవరావు, టీడీపీ నాయకులు బార్నాల సీతారాం, కె.నారాయణరావు పాల్గొన్నారు.

నిషేధిత పత్తి విత్తనాలు సాగుచేయవద్దు: ఏడీ

సాలూరురూరల్:పర్యావరణానికి, రైతుల ఆరోగ్యానికి ప్రమాదకరమైన నిషేధిత పత్తి విత్తనాలు (గ్లైపోసైట్ ట్రీటెడ్ కాటన్ సీడ్) సాగు చేస్తే రాయితీలు అందకుండా పోయే అవకాశాలు ఉన్నాయని సాలూరు వ్యవసాయ ఏడీ మధుసూదనరావు, ఏవో అనురాధ పండా తెలిపారు. బుధవారం సాలూరు మండలంలోని మరిపల్లి రామ మందిరంలో పత్తి రైతులకు పంట సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కొందరు నిషేదిత పత్తి విత్తనాలు తెచ్చారనే సమాచారం తెలియడంతో వాటి సాగు వల్ల చేకూరు నష్టాలను వివరించారు. ఈ విత్తనాలు వినియోగం వల్ల పర్యావరణానికి కీడు జరుగుతుందని, రైతుకు క్యాన్సర్ వ్యాధికి గురయ్యే ఆకాశముందని తెలిపారు.అధికంగా వర్షం వస్తే పంట దెబ్బతింటుందని, దిగుబడి తక్కువగా ఉంటుందని వివరించారు.ఈ విత్తనాలుఎవరైన విక్రయిస్తే సమా చారమి వ్వాలని కోరారు. ఈవిత్తన విక్రేతలపై క్రిమినల్ కేసు పెడతామని హెచ్చరించారు. చెముడులో ఈ విత్తన విక్రయాలు జరుగుతున్నట్టు సమాచారం రావడంతో మక్కువ ఏవోను ఆ గ్రామం వెళ్లి తనిఖీలు చేయాలని అక్కడ నుంచే వ్యవసాయ ఏడీ ఆదేశించారు.

రహదారి భద్రతపై అవగాహన

గుమ్మలక్ష్మీపురం: పార్వతీపురం బ్రేక్‌ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ గుమ్మలక్ష్మీపురం మండల కేం ద్రంలో బుధవారం పర్యటించారు. వాహనదారులకు రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరు లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. సకాలంలో రోడ్‌ట్యాక్స్ కట్టాలని సూచించారు. తమ వాహనాలకు సకాలంలో బ్రేక్ చేయించుకోవాలన్నారు. ఆయన వెంట పార్వతీపురం ఆర్టీసీ డిపో మేనేజర్ ఉన్నారు.

జీడి మొక్కలు నాటేందుకు ప్రణాళికలు

వీరఘట్టం: రోడ్డుకు ఇరువైపులా వివిధ పంచాయతీల్లో 45 ఎకరాల్లో జీడి , ఐదు ఎకరాల మామిడి మొక్కలు నాటేందుకు ప్రణాళికలు తయారు చేయాలని ఏపీడీ జి.శ్రీహరిరావు కోరారు. బుధవారం వీరఘట్టంలోని వెలుగు కార్యాలయంలో సిబ్బందితో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలంలో హార్టికల్చర్ దృష్టిసారించాలన్నారు. కార్య క్రమంలో ఎంపీడీవో ఎంపీటీ సుబ్రహ్మణ్యం, ఏపీవో జి.సత్యంనాయుడు పాల్గొన్నారు.

భవనాల నిర్మాణ ప్రకటనపై హర్షం

సీతంపేట:గిరిజన ప్రాంతాల్లో పంచాయతీలకు శాశ్వత భవనాలు నిర్మించాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ బాధ్యతలు స్వీకరించిన మొదటి రోజే ప్రకటించడంపై ఆదివాసీలు హర్షం వ్యక్తం చేస్తున్నట్టు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి పడాల భూదేవి తెలిపారు. బుధవారం సీతంపేటలో విలేకరులతో మాట్లాడుతూ గిరిజనులు పండించే ఉద్యాన పంటలకు గత ప్రభుత్వం నిర్వీర్యం చేసిందని, రాయితీలు కూడా ఎత్తివేసిందని ఆరోపించారు.

కార్యకర్తలను విధుల్లోకి తీసుకోవాలి

సీతంపేట: ఆశ్రమ పాఠశాలల్లో పనిచేస్తూ ఆరోగ్య కార్యకర్తలు, హెల్త్ అసిస్టెంట్లను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని రాష్ట్ర గిరిజన సంక్షేమ వసతిగృహాలు, పోస్టుమెట్రిక్ హాస్టల్స్ ఆరోగ్య కార్యకర్తలు, ఏఎన్‌ఎంల అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బిడ్డిక రామ్మోహన్‌రావు కోరారు.ఈ మేరకు గిరిజన సంక్షేమశాఖమంత్రి సంధ్యా రాణికి వినతిప త్రం అందజేసినట్టు ఒక ప్రకటనలో తెలిపారు.

చదువుపై దృష్టి సారించాలి

భామిని: విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థుల చదువుపై దృష్టిసారించాలని విద్యాశాఖాధికారులు శ్రీనివాసరావు, భాస్కరరావు కోరారు. బుధవారం స్థానిక ఆదర్శ పాఠశాలలో విద్యార్థుల తల్లిదం డ్రులతో ప్రిన్సిపాల్ ఆర్.శివకుమార్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ పాఠశాల అభివృద్ధిని వివరించారు.

అభివృద్ధికి కృషి చేయాలి

కురుపాం: నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేయాలని టీడీపీ రాష్ట్ర టీడీపీ కార్యదర్శి వైరిచర్ల వీరేష్ చంద్రదేవ్ కోరారు.ఈ మేరకు బుధవారం కురుపాం నియోజకవర్గ నాయకులతో గిరిజన, మహిళ,శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యరాణిని కలిశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జీవీ రమణమూర్తి, టీడీపీ నాయకులు సుకేష్ చంద్ర పండా,కర్రి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఎంఈవోలపై డిప్యూటీ డీఈవో విచారణ

జియ్యమ్మవలస: స్థానిక ఎమ్మార్సీలో బుధవారం పాలకొండ డిప్యూటీ విద్యాశాఖాధికారి పి.కృష్ణమూర్తి ఇద్దరి ఎంఈవోలపై విచారణ చేపట్టారు. ఈ ఏడాది ఏప్రిల్ 10నమండలంలోని ఉపాధ్యాయినులపై ఎంఈవో-1,2 ఎన్. నాగభూషణరావు, శ్రీనివాసరావు మాటలతో వేదిస్తున్నారని రాష్ట్ర టీచర్స్ యూనియన్ కార్యదర్శి దాడిచిలుక శ్యామ్ ఆర్జేడీకి పిర్యాదు చేశారు. ఈనేపథ్యంలో పాఠశాలలు పునః ప్రారంభంకావడంతో ఉన్నతా ధికారుల ఆదేశాల మేరకు పి.కృష్ణమూర్తి శ్యామ్ ఇచ్చిన అభియోగాలు, వివరణలు పరిశీలించిన ఆయన ఇద్దరు విద్యాశాఖాధికారులు ఇచ్చిన డిఫెన్స్ స్టేట్‌మెంట్లు పరిశీలించారు. అలాగే నాడు-నేడు పాఠశాల పనుల్లో ఎంఈవో-2 డబ్బులు అడుగుతున్నట్లు శ్యామ్ తన పిర్యాదులో పేర్కొన్నా రు. కానీ దీనికి తన వద్ద ఎటువంటి ఆధారం లేదని తెలిపారు. దీనిపై విచారణ నిర్వహించిన డిప్యూటీ డీఈవో పి.కృష్ణమూర్తి ఇదంతా అర్థం చేసుకోవడంతో తప్పిదం వల్లే జరిగిందని, వాస్తవానికి ఎటువంటి తప్పు జరగలేదని తేల్చారు. అంతేకాకుండా శ్యామ్ కూడా తన పిర్యాదును విత్‌డ్రా చేసుకున్నారని చెప్పారు.

17 నెలలుగా అందట్లే..

- ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి మంజూరు కాని గౌరవ వేతనాలు
- వెంటనే చెల్లించాలని విన్నపం
- గత వైసీపీ సర్కారు హయాంలోనే వారి నియామకం
- ఎన్నికల ముందు నుంచి నిధులు మంజూరు చేయని వైనం
- కొత్త ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని వేడుకోలు



జిల్లా మేనేజర్ షణ్ముఖరాజుకు వినతిపత్రం అందిస్తున్న సిబ్బంది

గరుగుబిల్లి : జిల్లాలోని పనిచేసే ప్రకృతి వ్యవసాయ సిబ్బందికి గత 17 నెలలుగా గౌరవ వేతనాలు మంజూరు కావడం లేదు. దీంతో వారు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తక్షణమే తమకు చెల్లింపులు చేయాలని బుధవారం పార్వతీపురంలో జిల్లా ప్రాజెక్టు మేనేజర్ షణ్ముఖరాజుకు వినతిపత్రాన్ని అందించారు. నెలలు తరబడి వేతనాలు అందకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారిందని తెలిపారు. రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పిస్తూ.. నిబంధనల మేరకు విధులు నిర్వహిస్తున్నా తమను పట్టించుకోకపోవడం దారుణమన్నారు.తక్కువ వేతనమే అయినా సకాలంలో చెల్లించకపోతే ఎలా? అని ప్రశ్నించారు. పలు కారణాలతో తొలగించిన దిగువ స్థాయి క్యాడర్లను తక్షణమే విధుల్లోకి తీసుకోవాలని, ప్రాసెసింగ్ మిషనరీలకు సబ్సిడీల మంజూరుతో పాటు క్యాడర్‌కు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. మార్కెటింగ్ కోసం ప్రతి మండలంలో స్టాల్ ఉండే విధంగా చూడాలన్నారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులకు ప్రాసెసింగ్ తదుపరి విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై జిల్లా మేనేజర్ షణ్ముఖరాజు స్పందిస్తూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లామని, కొద్ది రోజుల్లో సమస్య పరిష్కారం కానుందని తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సిబ్బంది ఎన్.ప్రసాద్, లక్ష్మణరావు, శ్రీరాములు, రామకృష్ణ, ధనుంజయ, రామారావు, నాగరాజు, తదితరులు ఉన్నారు.

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నియామకం..

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాలోన 15 మండలాల్లో 470 మందిని ప్రకృతి వ్యవసాయ సిబ్బందిగా నియమించారు. గ్రామస్థాయిలో పనిచేసే వారికి నెలకు రూ.5వేలు, మండల, డివిజన్ స్థాయిల్లో విధులు నిర్వర్తించే వారికి నెలకు రూ.6 వేల నుంచి రూ.35 వేల వరకు చెల్లించేవారు. అయితే ఎన్నికలకు కొద్దినెలల నుంచి గత వైసీపీ సర్కారు వారిని పట్టించుకోవడం మానేసింది. నిధులు మంజూరు చేయకపోవడంతో వారికి గౌరవ వేతనాలు అందడం లేదు. నూతన ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని ప్రకృతి వ్యవసాయ సిబ్బంది కోరుతన్నారు.

సికిల్‌సెల్‌పై అవగాహన



సీతంపేట: అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

పార్వతీపురం ఆంధ్రజ్యోతి: సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధిని నిర్మూలించడానికి ప్రతిఒక్కరూ పరీక్షలు చేయించుకోవాలని ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర తెలిపారు. బుధవారం పార్వతీపురం ఐటీడీఏ కార్యాలయంలో జాతీయ సికిల్‌సెల్ ఎనీమియా డే పురస్కరించుకుని అవగాహన, ప్రత్యేకనిర్ధారణ కేంద్రం కార్యక్రమాలు ఏర్పాటుచే శారు.ఈ సందర్భంగా ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సి.విష్ణుచరణ్ మాట్లాడుతూ సికిల్ సెల్ ఎనీమియా ముందుగా గుర్తించి చర్యలు తీసుకోవడం వల్ల భావితరాలకు సం క్రమించకుండా కాపాడుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ వైద్య ఆరోగ్యశాఖాధికారి శివకుమార్, ఐటీడీఏ ఏపీవో పి.మురళీధర్, ట్రైబల్ వెల్ఫేర్ ఉప సంచాలకులు రుక్మాంగదయ్య, ఐటీడీఏమేనేజర్ యూవీ పద్మనాభరాజు, ఏవో బీవీ నాగభూషణరావు, నియోజకవర్గ బీజేపీ ఇన్‌చార్జిసొండి సంజీవ్‌మాస్టార్, టీడీపీనాయకులు పాల్గొన్నారు.

- **సీతంపేట:** సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి పట్ల జాగ్రత్త వహించాని తహసీల్దార్ సోమేశ్వరరావు తెలిపారు. బుధవారం స్థానిక ప్రభుత్వ ఐటీఐ నుంచి ఐటీడీఏ కార్యాలయం వరకు అంతర్జాతీయ సికిల్‌సెల్ ఎనీమియా దినం పురస్కరించుకుని అవగాహన ర్యాలీ నిర్వహించారు. అలాగే స్థానిక గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు హెచ్‌ఎం పద్మశ్రీ అవగాహన కల్పించారు.కార్యక్రమంలో ఎంపీడీవో గీతాంజలి, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రఘురాం, ఏటీడీబ్ల్యువో మంగవేణి, డాక్టర్ తేజశ్రీ, డాక్టర్ ప్రసన్నకుమార్, ఐటీడీఏ ఏపీవో గణేష్ పాల్గొన్నారు.
- **భామిని:** బత్తిలిలో పీహెచ్‌సీ వైద్యాధికారి దామోదర ఆధ్వర్యంలో సికిల్‌సెల్ ఎనీమియా అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా వైద్య సిబ్బంది పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు.

రోగులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి

సీతానగరం: సీజనల్ వ్యాధులతో ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా మలేరియా అధికారి (డీఎంవో) జగన్మోహనరావు కోరారు. సీతానగరం పీహెచ్‌సీని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యక్రమంలో వైద్యాధికారి నిహారిక, ఏఎంఓ సూర్యనారాయణ పాల్గొన్నారు,